RNI NO: APTEL/25/A0108

www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 142, ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజిలు : 8 వెల రూ. 2 శనివారం -22 - ఆగష్టు - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

## సౌదీపై హౌతీల డ్రోన్ దాడులు.. ఎయిర్‌పోర్ట్, చమురు కేంద్రం టార్గెట్




సౌదీలోని నజ్రాన్ ఎయిర్‌పోర్ట్, చమురు కేంద్రంపై డ్రోన్ దాడులు

తామే ఈ దాడులు చేశామని ప్రకటించిన యెమెన్ హౌతీ గ్రూప్

## పోలీస్ స్టేషన్ ముందు రాహుల్ గాంధీ ధర్నా.. పెల్లెట్ గన్ బాధితుడితో కలిసి ఎఫ్ఐఆర్ కోసం డిమాండ్




పెల్లెట్ గన్ బాధితుడితో పోలీస్ స్టేషన్‌కు రాహుల్ గాంధీ

ఎఫ్ఐఆర్ కోసం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం ముందు ధర్నా

జులై 20 నిరసనల్లో పెల్లెట్లు తగిలాయని యువకుడి ఆరోపణ

పెల్లెట్ గన్స్ వాడలేదని ఢిల్లీ పోలీసుల వాదన

## కీలక జలమార్గాలపై త్వరలో పూర్తి నియంత్రణ సాధిస్తాం.. ట్రంప్ సంచలన ప్రకటన




ఇరాన్‌కు అణ్వాయుధం దక్కనివ్వబోమని స్పష్టీకరణ

యుద్ధ ప్రభావంతో ఇంధన ధరలు పెరగవచ్చని అంగీకారం

ఇరాన్ నౌకా, వైమానిక శక్తి బలహీనపడిందని వ్యాఖ్య




## కామెరూన్ సరిహద్దులో ఘోరం.. కుప్పకూలిన బంగారు గని, 100 మందికి పైగా మృతి!

కామెరూన్-సీఏఆర్ సరిహద్దులోని బంగారు గనిలో భారీ ప్రమాదం

49 మంది చనిపోయినట్లు సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ ప్రభుత్వం ధ్రువీకరణ

కార్మికుల క్రమశిక్షణారాహిత్యమే కారణమని మంత్రి వెల్లడి

శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం కొనసాగుతున్న సహాయక చర్యలు

# స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

### స్థానిక ఎన్నికల్లో భిన్నమైన వ్యూహంతో.. అనుసరించాల్సిన విధివిధానాల రూపకల్పనకు కమిటీ

- ★ మెరుగైన స్థాయిలో జనసేన పోటీ
- ★ తగిన స్థానాలను ఎమ్మెల్యేలు గుర్తించాలి
- ★ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాంతాల వారీగా అక్కడి రాజకీయ, సామాజిక పరిస్థితులను బట్టి వ్యూహాలు ఉంటాయి



అమరావతి: 'వైకాపా దాష్టీక పాలనకు చరమగీతం పాడాలనే సంకల్పంతోనే గత శాసనసభ ఎన్నికల్లో జనసేన పార్టీ 21 స్థానాలకే పరిమితమై పోటీ చేసింది. ఆ వ్యూహం ఆ ఎన్నికలకే పరిమితం. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాంతాల వారీగా అక్కడి రాజకీయ, సామాజిక పరిస్థితులను బట్టి మిగతా 2 లో




## ప్రణయ్ తేజ్ ఘటన నుంచి ఇంకా తేరుకోలేకపోతున్నాను: నారా లోకేశ్

- విశాఖ చిన్నారి ప్రణయ్ తేజ్ మృతి ఘటనపై మంత్రి లోకేశ్ తీవ్ర ఆవేదన
- ఒక తండ్రిగా ఆ తల్లిదండ్రుల బాధను ఊహించలేకపోతున్నానని వ్యాఖ్య
- పాఠశాలల్లో శారీరక దండనలకు చోటులేదని స్పష్టీకరణ
- ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం

అమరావతి: పాఠశాల విద్యార్థి ప్రణయ్ తేజ్ మృతి ఘటనపై ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి,




## ఈనెల 29 నుంచి సీడ్ యాక్సెస్ రోడ్డు మూడో దశ పనులు: నారాయణ

- ●ప్రస్తుతం ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే లైన్ పనులపై దృష్టి సారించామన్న నారాయణ
- ●ఆ తర్వాత విమానాశ్రయం నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడి
- ●ఇకపై ప్రతినెలా ఒక టవర్ పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించామన్న మంత్రి

## దేశంలో పెరుగుతున్న స్వైన్ ఫ్లూ.. కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా సమీక్ష

### జాతీయ స్థాయి సన్నద్ధత, నివారణ చర్యలపై నడ్డా సమీక్ష

- ▶▶ నిరంతర నిఘా, వ్యాధి వ్యాప్తి నిరోధక చర్యలను సమీక్షించిన నడ్డా
- ▶▶ వ్యాధి లక్షణాలున్నవారిని ముందస్తుగా గుర్తించడం కీలకమన్న కేంద్ర మంత్రి




ఢిల్లీ: దేశంలో స్వైన్ ఫ్లూ (ఎచ్1ఎన్1) కేసులు నమోదవుతున్న నేపథ్యంలో, జాతీయ స్థాయి సన్నద్ధత, నివారణ చర్యలపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా నిరంతర నిఘా, వ్యాధి వ్యాప్తి నిరోధక చర్యలు పటిష్ఠంగా మిగతా 2 లో

## ఎమ్మెల్యేలకు ఫ్రీగా కార్లు ఇస్తామన్న సీఎం విజయ్..

### సొంతంగా కారు లేని వారికే ఈ పథకమన్న ప్రభుత్వం

- ▶▶ వద్దన్న ఉదయనిధి స్టాలిన్
- ▶▶ తమిళనాడులో ఎమ్మెల్యేలందరికీ ఉచిత కార్లు ఇస్తామన్న సీఎం విజయ్
- ▶▶ డ్రైవర్, ఇంధనం కోసం నెలకు రూ. 75,000 అలవెన్స్ ప్రకటన
- ▶▶ ప్రభుత్వ ఆఫర్‌ను తిరస్కరించిన ప్రతిపక్ష డీఎంకే



తమిళనాడు: తమిళనాడులో అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే మధ్య వాహనాల కేటాయింపు వ్యవహారం రాజకీయ దుమారానికి దారితీసింది. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలందరికీ ప్రభుత్వ ఖర్చుతో మిగతా 2 లో




## 'క్యూర్' పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల అర్హత జాబితా విడుదల.. మీ స్టేటస్ ఇలా చెక్ చేసుకోండి

- ●క్యూర్ ఇందిరమ్మ ఇళ్ల ప్రాథమిక అర్హుల జాబితా విడుదల
- ●మొత్తం 7,340 ఇళ్లకు 60,720 దరఖాస్తులు
- ●అర్హత, అనర్హత స్టేటస్‌ను ఆన్‌లైన్‌లో చూసుకునే వీలు
- ●అభ్యంతరాల స్వీకరణకు ఆగస్టు 23 సాయంత్రం వరకు గడువు

# పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా క్రమశిక్షణ చర్యలు తప్పవు

### కొండా ఫ్యామిలీపై రేవంత్ రెడ్డి సీరియస్.. చర్యలు తప్పవని హెచ్చరిక!

- ★ క్రమశిక్షణ ఉల్లంఘనగా పరిగణించిన కాంగ్రెస్ అధిష్ఠానం
- ★ కఠిన చర్యలు తప్పవని పార్టీ ముఖ్య నేతలకు స్పష్టం చేసిన సీఎం
- ★ మంత్రి సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన పీసీసీ
- ★ సీఎంపై విమర్శలు చేస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని గట్టి సంకేతాలు



హైదరాబాద్: మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. పార్టీలో క్రమశిక్షణారాహిత్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని ఢిల్లీ పర్యటన నుంచే ముఖ్య నేతలకు ఆయన గట్టి హెచ్చరికలు పంపినట్లు తెలిసింది. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం కూడా అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మూడు రోజుల క్రితం సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా పరకాలలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. మిగతా 2 లో




## సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు అందుకే అనుమతి ఇవ్వలేదు.. విదేశాంగ శాఖ క్లారిటీ

- ▶▶ రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు ఎంఈఏ అనుమతి నిరాకరణ
- ▶▶ పర్యటన కార్యక్రమం హోదాకు, ఉద్దేశానికి తగినట్లు లేదని కేంద్రం స్పష్టీకరణ
- ▶▶ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడి
- ▶▶ అమెరికా పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని సీఎంవో ప్రకటన

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదిత అమెరికా పర్యటనకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో విదేశీ వ్యవహారాల

## సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు అందుకే
# అనుమతి ఇవ్వలేదు.. విదేశాంగ శాఖ క్లారిటీ

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదిత అమెరికా పర్యటనకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) శుక్రవారం స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి హోదాకు, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా కార్యక్రమం లేదని భావించడంతో అమెరికా పర్యటనకు రాజకీయ అనుమతి నిరాకరించినట్లు ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలకు రాజకీయ అనుమతి ఇచ్చే ముందు వారి కార్యక్రమాలను మంత్రిత్వ శాఖ పరిశీలిస్తుందని జైస్వాల్ చెప్పారు. సంబంధిత పదవికి, పర్యటన ఉద్దేశానికి తగినట్లుగా కార్యక్రమం ఉండాలని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన విషయంలో ఆ ప్రమాణానికి అనుగుణంగా కార్యక్రమం లేదని, అందుకే రాజకీయ అనుమతి ఇవ్వలేదని తెలిపారు. బ్రిటన్ పర్యటనకు మాత్రం అనుమతి ఇచ్చినట్లు గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి ప్రస్తుతం లండన్‌లో ఉన్నారు. అక్కడి నుంచి అమెరికా వెళ్లి ఆగస్టు 30న హైదరాబాద్ చేరుకోవాల్సి ఉంది. అయితే అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో ఆయన ముందే హైదరాబాద్ చేరుకోనున్నారు. అమెరికా పర్యటనలో ఆయన 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో కలిసి పెట్టుబడిదారులను కలవాల్సి ఉన్నట్లు తెలంగాణ సీఎంవో వెల్లడించింది. ఈ పర్యటనకు రాజకీయ కోణంలో అనుమతి నిరాకరించడంతో పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని తెలిపింది.

## 'క్యూర్' పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల అర్హత జాబితా విడుదల..
# మీ స్టేటస్ ఇలా చెక్ చేసుకోండి

హైదరాబాద్: 'క్యూర్' ఏరియా పరిధిలోని ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ప్రాథమిక అర్హుల జాబితాను విడుదల చేసింది. ఈ పథకం కింద మొత్తం 7,340 ఇళ్లను కేటాయించాల్సి ఉండగా, ప్రభుత్వం వద్దకు 60,720 దరఖాస్తులు అందాయి. దరఖాస్తుదారుల ఆస్తులు, వాహనాలు, సొంత ఇల్లు వంటి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు, ప్రాథమికంగా సుమారు 40,000 మందిని అర్హులుగా గుర్తించారు. దరఖాస్తుదారులు తమ స్టేటస్‌ను ఆన్‌లైన్‌లో సులభంగా తెలుసుకోవచ్చు. దరఖాస్తుదారులు తమ స్టేటస్‌ను చెక్ చేసుకునేందుకు tghb.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలి. అక్కడ అప్లికేషన్ నంబర్, మొబైల్ నంబర్ లేదా ఆధార్ నంబర్ ఆప్షన్‌ను ఎంచుకుని, సంబంధిత వివరాలు ఎంటర్ చేసి సెర్చ్ చేయాలి. దీంతో మీ అప్లికేషన్ నంబర్, పేరు, ప్రాజెక్ట్ లొకాలిటీ, స్టేటస్ వంటి వివరాలు కనిపిస్తాయి. ఒకవేళ మీ స్టేటస్ 'అనర్హులు' అని చూపిస్తే, దాని పక్కనే ఉన్న 'రెయిజ్ క్లెయిమ్' ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఎందుకు అనర్హులుగా ప్రకటించారో కారణం అక్కడ కనిపిస్తుంది. ఆ కారణం సరైంది కాదని భావిస్తే, అక్కడే మీ అభ్యంతరాన్ని తెలిపి, దానికి సంబంధించిన ఆధారాలను అప్‌లోడ్ చేయవచ్చు. అభ్యంతరాలు, క్లెయిమ్‌లను ఆగస్టు 23వ తేదీ సాయంత్రం లోపు సమర్పించాలి. తుది అర్హుల జాబితాను ఆగస్టు 25న ప్రకటించి, ఆగస్టు 27 నుంచి 30 వరకు లాటరీ ద్వారా ఇళ్లను కేటాయిస్తారు. ఏవైనా సందేహాలుంటే 040-24603572 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని అధికారులు తెలిపారు.

## ఈనెల 29 నుంచి సీడ్ యాక్సెస్ రోడ్డు
# మూడో దశ పనులు: నారాయణ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. కీలకమైన సీడ్ యాక్సెస్ రహదారి మూడో దశ పనులపై మంత్రి నారాయణ ప్రకటన చేశారు. ఈ నెల 29వ తేదీన మూడో దశ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. గుంటూరు జిల్లా తుళ్లూరులోని వందల ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి, శ్రీ బాలకోటేశ్వర స్వామి ఆలయాల పునఃప్రతిష్ఠ మహోత్సవంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో రాజధాని రైతులు అమరావతి పరిరక్షణ కోసం చేపట్టిన 'న్యాయస్థానం టు దేవస్థానం' పాదయాత్ర ఇదే తుళ్లూరు ఆలయం నుంచే ప్రారంభమై విజయవంతమైందని మంత్రి గుర్తుచేశారు. రైతుల త్యాగాల పునాదులపైనే అమరావతి మళ్లీ పునర్నిర్మాణం అవుతోందన్నారు. రాజధాని నిర్మాణంలో భాగమైన ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే లైన్ పనులపై ప్రస్తుతం ప్రధానంగా దృష్టి సారించామని, ఆ తర్వాత విమానాశ్రయం నిర్మాణ అంశంపై తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అమరావతి పరిపాలనా నగరంలో టవర్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తూ ప్రతినెలా ఒక్కో టవర్ నిర్మాణాన్ని పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. అలాగే, రాజధాని రైతుల రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధి పనులకు సంబంధించి ఈ నెల 27న టెండర్లు ఓపెన్ చేస్తున్నామని, ప్రక్రియ పూర్తి కాగానే క్షేత్రస్థాయిలో పనులు వేగంగా మొదలుపెడతామని మంత్రి స్పష్టం చేశారు.

## దేశంలో పెరుగుతున్న స్వైన్ ఫ్లూ..
# కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా సమీక్ష

ఢిల్లీ: దేశంలో స్వైన్ ఫ్లూ (ఎ1బీ1) కేసులు నమోదవుతున్న నేపథ్యంలో, జాతీయ స్థాయి సన్నద్ధత, నివారణ చర్యలపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా నిరంతర నిఘా, వ్యాధి వ్యాప్తి నిరోధక చర్యలు పటిష్ఠంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఢిల్లీతో పాటు ఇతర ప్రధాన ప్రాంతాల్లోని ఆసుపత్రులలో బెడ్ల లభ్యత, ఐసోలేషన్ వార్డుల ఏర్పాటుతో పాటు అవసరమైన మందులు, టీకాల లభ్యతపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, హెల్త్ సెక్రటరీలతో కూడిన బృందానికి నిరంతరం కేసులను పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యంగా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ముందస్తుగా గుర్తించడం, బాధితులకు సకాలంలో చికిత్స అందించడం.. ప్రజల్లో పరిశుభ్రత, అవగాహన పెంపొందించడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల జిల్లాల్లో కూడా అవసరమైన ఫ్లూ నిరోధక మందుల కొరత లేకుండా చూడాలని అన్ని రాష్ట్రాల ఆరోగ్య శాఖలను కోరారు.

## ప్రణయ్ తేజ్ ఘటన నుంచి
## ఇంకా తేరుకోలేకపోతున్నాను: నారా లోకేశ్



అమరావతి: పాఠశాల విద్యార్థి ప్రణయ్ తేజ్ మృతి ఘటనపై ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, క్రమశిక్షణ పేరుతో చిన్నారులపై హింసకు పాల్పడటాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. "ఒక తండ్రిగా, విశాఖ చిన్నారి ప్రణయ్ తేజ్‌కు జరిగిన ఘటన గురించి నేను ఇంకా తేరుకోలేకపోతున్నాను. అతని తల్లిదండ్రులు అనుభవిస్తున్న బాధను ఊహించుకోలేను. మన పాఠశాలల్లో శారీరక దండనలకు ఏమాత్రం చోటు లేదు. క్రమశిక్షణ పేరుతో ఏ బిడ్డపైనా హింస జరగకూడదు" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ దురదృష్టకర ఘటనపై ఇప్పటికే పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ తీవ్రమైన దుఃఖ సమయంలో ప్రణయ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు లోకేశ్ పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇండియా టుడేలో ప్రచురితమైన కథనాన్ని తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకుంటూ లోకేశ్ ఈ విధంగా స్పందించారు. మంత్రి ఆదేశాలతో విద్యాశాఖ అధికారులు ఈ ఘటనపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

## ఎమ్మెల్యేలకు ఫ్రీగా కార్లు ఇస్తామన్న సీఎం విజయ్..
# వద్దన్న ఉదయనిధి స్టాలిన్



తమిళనాడు: తమిళనాడులో అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే మధ్య వాహనాల కేటాయింపు వ్యవహారం రాజకీయ దుమారానికి దారితీసింది. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలందరికీ ప్రభుత్వ ఖర్చుతో కార్లు అందజేస్తామని ముఖ్యమంత్రి విజయ్ చేసిన ప్రకటనను డీఎంకే తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ ప్రతిపాదనను తమ పార్టీ తిరస్కరిస్తున్నట్లు ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని 234 మంది ఎమ్మెల్యేలకు నియోజకవర్గ పనుల నిమిత్తం ప్రభుత్వ వాహనాలు సమకూర్చుతామని ప్రకటించారు. వీటితో పాటు డ్రైవర్, ఇంధనం, నిర్వహణ ఖర్చుల కోసం నెలకు రూ. 75,000 అలవెన్స్ కూడా మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఆర్థిక నేపథ్యం లేని కొత్త ఎమ్మెల్యేలకు ఇది ఎంతో ఊరటనిస్తుందని, పారదర్శకమైన, అవినీతిరహిత పాలనకు ఈ నిర్ణయం దోహదపడుతుందని ప్రభుత్వం పేర్కొంది. అయితే, ప్రభుత్వ నిర్ణయంపై డీఎంకే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రాష్ట్రం అప్పుల్లో ఉందని పదేపదే చెబుతున్న టీవీకే ప్రభుత్వం, ఇప్పుడు ఎమ్మెల్యేలకు కార్లు పంపిణీ చేయడమేమిటని ఉదయనిధి స్టాలిన్ ప్రశ్నించారు. తమ పార్టీకి చెందిన 59 మంది ఎమ్మెల్యేలు ఈ కార్లను తీసుకోబోరని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల ఎన్నికల అఫిడవిట్లను పరిశీలించి, సొంత వాహనాలు లేని వారికి మాత్రమే ఈ సౌకర్యం కల్పించాలని ఆయన సూచించారు. డీఎంకే విమర్శలపై మంత్రి ఆధవ్ అర్జున ఘాటుగా స్పందించారు. ఈ పథకం కింద సొంతంగా కారు లేని ఎమ్మెల్యేలకు మాత్రమే వాహనాలు కేటాయిస్తామని ఆయన స్పష్టతనిచ్చారు. ఇది విలాసం కాదని, ప్రజాసేవకు అవసరమైన కనీస సదుపాయమని వ్యాఖ్యానించారు. అనేక బంగ్లాలు ఉన్నప్పటికీ ఉదయనిధి స్టాలిన్ ప్రభుత్వ క్వార్టర్స్‌లో ఎందుకు నివసిస్తున్నారని ఆయన నిలదీశారు. ముఖ్యంగా చిన్న పార్టీల నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలకు ఈ వాహనాలు ఎంతో అవసరమని ప్రభుత్వం తన నిర్ణయాన్ని సమర్థించుకుంది.

## పోలీస్ స్టేషన్ ముందు రాహుల్ గాంధీ ధర్నా..
## పెల్లెట్ గన్ బాధితుడితో కలిసి ఎఫ్ఐఆర్ కోసం డిమాండ్

ఢిల్లీ: పెల్లెట్ గన్ గాయాల వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం ఢిల్లీలో ఆందోళనకు దిగారు. జులై 20న జరిగిన జెన్-జీ విద్యార్థుల నిరసనల్లో పెల్లెట్ గన్ గాయాలయ్యాయని ఆరోపిస్తున్న సాహిల్ లోచాబ్‌ను వెంటబెట్టుకుని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అనంతరం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం బయట బాధితుడితో కలిసి ధర్నాకు కూర్చున్నారు. జులై 20న పరీక్షల పేపర్ లీక్‌లకు నిరసనగా వందలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. 'ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్' (ఆర్ఏఎఫ్) సిబ్బంది పెల్లెట్ గన్స్ ఉపయోగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ ఘటనలో గాయపడినట్లు పలువురు నిరసనకారులు చెప్పడంతో పాటు వైద్య నివేదికలు కూడా ఉన్నాయని కాంగ్రెస్ పేర్కొంది. అయితే జులై 20న పెల్లెట్ గన్స్ ఉపయోగించలేదని ఢిల్లీ పోలీసులు పలుసార్లు తెలిపారు. ఈ అంశంపై సీఆర్‌పీఎఫ్ మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. మరోవైపు, గాయపడిన నిరసనకారుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు పెల్లెట్ గన్స్ వాడలేదన్న వాదనపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని కాంగ్రెస్ పేర్కొంది.

# సౌదీపై హౌతీల డ్రోన్ దాడులు..
# ఎయిర్‌పోర్ట్, చమురు కేంద్రం టార్గెట్

ఢిల్లీ: సౌదీ అరేబియాలోని దక్షిణ నజ్రాన్ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని రెండు డ్రోన్ దాడులు నిర్వహించినట్లు యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు గురువారం ప్రకటించారు. ఈ దాడుల్లో నజ్రాన్ విమానాశ్రయం, ప్రభుత్వరంగ చమురు సంస్థ అరామ్కోకు చెందిన ఒక కేంద్రాన్ని టార్గెట్ చేశామని తెలిపారు. హౌతీ సైనిక ప్రతినిధి యాహ్యా సరీ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఈ విషయాన్ని వెల్లడించారు. నజ్రాన్ ఎయిర్‌పోర్ట్‌లోని ఒక సున్నితమైన లక్ష్యంతో పాటు, అరామ్‌కో కేంద్రాన్ని డ్రోన్లతో విజయవంతంగా ఛేదించామని పేర్కొన్నారు. అయితే, ఈ దాడుల వల్ల జరిగిన నష్టం లేదా ప్రాణనష్టం వివరాలను ఆయన వెల్లడించలేదు. తమ అధీనంలోని సాదా ప్రావిన్స్ గగనతలంలోకి సౌదీ డ్రోన్లు చొరబడినందుకు ప్రతీకారంగానే ఈ దాడులు చేసినట్లు హౌతీలు వివరించారు. హౌతీల ప్రకటనపై సౌదీ అధికారులు గానీ, అరామ్కో సంస్థ గానీ ఇప్పటివరకు స్పందించలేదు. మరోవైపు, గత 24 గంటల్లో హౌతీ స్థావరాలపై 81 సైనిక చర్యలు చేపట్టినట్లు యెమెన్ ప్రభుత్వ దళాలు ప్రకటించాయి. ఈ దాడుల్లో పలువురు హౌతీ సభ్యులు, కమాండర్లు మరణించారని లేదా గాయపడ్డారని ప్రభుత్వ దళాల ప్రతినిధి తెలిపారు. 2014 నుంచి యెమెన్‌లో అంతర్యుద్ధం కొనసాగుతున్న విషయం తెలిసిందే. హౌతీలు రాజధాని సనాతో సహా ఉత్తర యెమెన్‌ను ఆక్రమించడంతో, 2015లో యెమెన్ ప్రభుత్వానికి మద్దతుగా సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు రంగంలోకి దిగాయి. ఇటీవలి కాలంలో ఇరువర్గాల మధ్య దాడులు, ప్రతిదాడులతో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి.

## కీలక జలమార్గాలపై త్వరలో
## పూర్తి నియంత్రణ సాధిస్తాం.. ట్రంప్ సంచలన ప్రకటన

ఢిల్లీ: ఇరాన్‌కు చెందిన కీలక జలమార్గాలపై అమెరికా ఇప్పటికే గణనీయమైన నియంత్రణ సాధించిందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. త్వరలో పూర్తి నియంత్రణ తమ చేతికి వస్తుందని అన్నారు. అదే సమయంలో ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేయనివ్వబోమని మరోసారి స్పష్టం చేశారు. మాజీ వ్యక్తిగత న్యాయవాది మైఖేల్ కోహెన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏ జలమార్గాల గురించి మాట్లాడుతున్నారన్నది మాత్రం ఆయన స్పష్టంగా చెప్పలేదు. ఇరాన్‌పై సైనిక చర్యల కారణంగా అమెరికన్లకు పెట్రోల్, ఇంధన ధరలు కొంత పెరగవచ్చని కూడా అంగీకరించారు. అయినా ఇరాన్‌ను అణ్వాయుధం తయారు చేయకుండా అడ్డుకోవడం మరింత ముఖ్యమని చెప్పారు. ఇరాన్ నౌకాదళం, వైమానిక దళం తీవ్రంగా బలహీనపడ్డాయని ట్రంప్ పేర్కొన్నారు. అక్కడి కీలక నాయకులు కూడా లేకపోవడంతో చర్చల ద్వారా ఒప్పందం కుదుర్చుకోవడం కష్టంగా మారిందన్నారు. ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల తయారీ సామర్థ్యం భారీగా దెబ్బతిందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఆ దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ఒత్తిడి ఉందన్నారు. ద్రవ్యోల్బణం పెరగడం, కరెన్సీ విలువ పడిపోవడం వంటి అంశాలను ప్రస్తావించారు. ఇరాన్ అణ్వాయుధం తయారుచేసే దశకు కేవలం రెండు వారాల దూరంలో ఉందని తమకు సమాచారం ఉందని ట్రంప్ చెప్పారు. అందుకే ఇరాన్ అణు కేంద్రాలపై బీ-2 బాంబర్లతో దాడి చేశామని తెలిపారు. ప్రతి బాంబు లక్ష్యాన్ని ఛేదించిందని పేర్కొన్నారు. ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉంటే ఇజ్రాయెల్‌తో పాటు పశ్చిమాసియా దేశాలకు భారీ ముప్పు ఉండేదని ట్రంప్ అన్నారు. ఇజ్రాయెల్ భద్రతలో తన పాత్ర కీలకమని కూడా వ్యాఖ్యానించారు.

## కామెరూన్ సరిహద్దులో ఘోరం..
## కుప్పకూలిన బంగారు గని, 100 మందికి పైగా మృతి!



ఢిల్లీ: ఆఫ్రికాలో పెను విషాదం చోటుచేసుకుంది. కామెరూన్, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ (సీఏఆర్) సరిహద్దులో ఉన్న ఓ బంగారు గని కుప్పకూలడంతో 100 మందికి పైగా కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో జంబోయే గ్రామంలో ఈ ఘోర దుర్ఘటన జరిగినట్లు అధికారులు వెల్లడించారు. కామెరూన్ ఈస్ట్ రీజియన్ గవర్నర్ గ్రెగోయిర్ వోంగో మాట్లాడుతూ.. ప్రమాదం జరిగిన గని సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ భూభాగంలో ఉందని తెలిపారు. ఈ ఘటనలో సుమారు ముగ్గురి నుంచి ఐదుగురు కామెరూన్ జాతీయులు మరణించి ఉంటారని అంచనా వేశారు. బాధితులను రక్షించేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నామని ఆయన చెప్పారు. అయితే, కామెరూన్ ప్రభుత్వ మీడియా సంస్థ సీఆర్‌టీవీ మాత్రం మృతుల సంఖ్య 100 దాటిందని పేర్కొంది. ఇతర స్థానిక మీడియా సంస్థల కథనాల ప్రకారం, ఇప్పటికే శిథిలాల నుంచి 107 మృతదేహాలను వెలికితీశారు. ఈ నేపథ్యంలో, ప్రమాద స్థలాన్ని సందర్శించిన సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ గనులు, భూగర్భ శాఖ మంత్రి రుఫిన్ బెనామ్-బెల్టొంగొ అధికారిక ప్రకటన చేశారు. ఈ దుర్ఘటనలో మొత్తం 49 మంది మరణించినట్లు ఆయన ధ్రువీకరించారు. మృతుల్లో 34 మంది సీఏఆర్ జాతీయులు, 13 మంది కామెరూన్ వాసులు, ఇద్దరు చాద్ దేశస్థులు ఉన్నారని మంత్రి వివరించారు. కార్మికుల క్రమశిక్షణారాహిత్యం కూడా ప్రమాదానికి ఒక కారణమని కొందరు అధికారులు తన దృష్టికి తెచ్చారని ఆయన పేర్కొన్నారు. తక్షణమే గని కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేయాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రమాదంతో స్థానిక సమాజం తీవ్ర దిగ్భ్రాంతికి గురైందని, కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయని సమీప నివాసి ఒరిజెన్ డోక్నా ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలాల కింద ఇంకా ఎవరైనా చిక్కుకుని ఉండవచ్చనే అనుమానంతో సహాయక బృందాలు గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయి. ఆఫ్రికాలో గనుల భద్రతపై ఆందోళనలు పెరుగుతున్న తరుణంలో ఈ ప్రమాదం జరిగింది. కాగా, గత జులైలో కెన్యాలోని నరోక్ కౌంటీలో ఓ బంగారు గని కూలి ఐదుగురు కార్మికులు మరణించారు.

## పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా
# క్రమశిక్షణ చర్యలు తప్పవు

మొదటి పేజి తరువాయి



పార్టీలో క్రమశిక్షణారాహిత్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని ఢిల్లీ పర్యటన నుంచే ముఖ్య నేతలకు ఆయన గట్టి హెచ్చరికలు పంపినట్లు తెలిసింది. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం కూడా అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మూడు రోజుల క్రితం సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా పరకాలలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. తద్వారా రేవూరి అభ్యర్థిత్వాన్ని దాదాపు ఖరారు చేస్తూ స్పష్టమైన సంకేతాలిచ్చారు. అయితే, ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాల్ చేసేలా.. ఆ మరుసటి రోజే మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ పరకాల నియోజకవర్గంలో సభ నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా, వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తానే పోటీ చేస్తానని ప్రకటించుకోవడం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర ప్రకంపనలు సృష్టించింది. సీఎం పర్యటనకు స్థానిక మంత్రిగా ఉన్న కొండా సురేఖ గైర్హాజరు కావడం, ఆ వెంటనే ఆమె కుమార్తె ఈ వ్యాఖ్యలు చేయడం ఒక ప్రణాళిక ప్రకారమే జరిగిందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. ఈ పరిణామాలపై ఢిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్.. అక్కడే కొందరు ముఖ్య నేతల వద్ద తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మరికొందరు సీనియర్ మంత్రులతో ఫోన్‌లో మాట్లాడి, ఈ వ్యవహారంపై సీరియస్‌గా ఉన్నట్లు చెప్పారని సమాచారం. సీఎం ఆదేశాల మేరకు పీసీసీ క్రమశిక్షణా కమిటీ వెంటనే రంగంలోకి దిగింది. మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కుమార్తె చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇవ్వాలని కోరింది. అయితే, "కుమార్తె చేసిన వ్యాఖ్యలకు నేనెలా బాధ్యురాలిని అవుతాను?" అని మంత్రి సురేఖ సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఈ విషయంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పందిస్తూ.. "సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఎవరికి వారు పోటీ చేస్తామని ప్రకటించుకోవడం సరికాదు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా క్రమశిక్షణ చర్యలు తప్పవు. మంత్రి సురేఖ వివరణను పరిశీలించాక తదుపరి చర్యలపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుంది" అని స్పష్టం చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

మొదటి పేజి తరువాయి



ఆ వ్యూహం ఆ ఎన్నికలకే పరిమితం. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాంతాల వారీగా అక్కడి రాజకీయ, సామాజిక పరిస్థితులను బట్టి వ్యూహాలు ఉంటాయి. అందుకు తగ్గట్టు స్థానిక ఎన్నికల్లో జనసేన ప్రభావశీలంగా, మెరుగైన స్థాయిలో నిలబడుతుంది' అని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. జనసేన ఎమ్మెల్యేలు నియోజకవర్గాలకే పరిమితం కాకుండా వారి ప్రాంతాల్లో జనసేన బలాబలాలను బేరీజు వేసుకుని పోటీ చేసేందుకు తగిన స్థానాలను గుర్తించి పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదిక ఇవ్వాలని నిర్దేశించారు. శాసనసభ ప్రాంగణంలోని ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో పవన్‌కల్యాణ్ అధ్యక్షతన జనసేన శాసనసభాపక్ష సమావేశం జరిగింది. మున్సిపల్, పంచాయతీరాజ్ ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. 'స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున అనుసరించాల్సిన విధివిధానాల రూపకల్పన, క్షేత్రస్థాయిలోని పార్టీ శ్రేణుల ఆలోచనలను ముందుకు తీసుకెళ్లేందుకు 9-11 మంది ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులతో ప్రత్యేక కమిటీ నియమిస్తాం' అని అన్నారు. ప్రజాప్రతినిధులు చెప్పిన అంశాలు నోట్ చేసుకున్న పవన్‌కల్యాణ్ ఎన్నికల సంసిద్ధతపై వారికి దిశా నిర్దేశం చేశారు. దాడులకు ఎదురొడ్డిన వారి స్ఫూర్తికి విలువ ఇచ్చేలా నిలబడతాం..: 'జనసైనికులు, వీర మహిళల పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నాటి పాలకులు ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను నామినేషన్ కూడా వేయనివ్వకుండా అడ్డుకున్నారు. జనసేన నాయకులు ఆ దాడులు, ఒత్తిళ్లకు ఎదురొడ్డి ధైర్యంగా నిలబడి పోటీ చేశారు. వారి స్ఫూర్తికి విలువ ఇచ్చేలా ఈసారి జనసేన నిలబడుతుంది. రాబోయే స్థానిక ఎన్నికల్లో జనసేన ఎంత బలంగా నిలబడితే అంత మెరుగైన ఫలితం ఉంటుంది. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన శ్రేణులు ధైర్యంగా నిలబడ్డాయి. ఆ స్ఫూర్తి 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి దోహదపడింది' అని పవన్‌కల్యాణ్ అన్నారు. కొన్నిచోట్ల ఎమ్మెల్యేలు కూటమి ధర్మానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు: 'జనసేన పార్టీ ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాల్లో కొన్నిచోట్ల ఎమ్మెల్యేలు కూటమి ధర్మానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. దీనివల్ల పార్టీ శ్రేణుల్లో అసహనం నెలకొంది' అని పలువురు ఎమ్మెల్యేలు అధినేత దృష్టికి తీసుకొచ్చారు. ఈ అంశాలు తన దృష్టికి వచ్చాయని.. పార్టీ శ్రేణుల అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుంటామని పవన్‌కల్యాణ్ అన్నారు. రాజకీయంగా వారిని బలోపేతం చేసేలా ముందుకు వెళ్దామని, వారికి మెరుగైన అవకాశాలు కల్పిద్దామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, ఏపీ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌నాగబాబు, రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేష్, ప్రభుత్వ విప్‌లు బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, పార్టీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## కబ్జాకోరులకు మల్కాజ్‌గిరి మహిళా సీపీ షాక్..
## వృద్ధురాలికి దక్కిన రూ.40 కోట్ల భూమి!



హైదరాబాద్: హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో 80 ఏళ్ల ఓ వృద్ధురాలు భూకబ్జాదారుల చెర నుంచి తన రూ. 40 కోట్ల విలువైన ఆస్తిని దక్కించుకున్నారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ (సీపీ) సుమతి చొరవతో ఆమెకు సకాలంలో న్యాయం చేకూరింది. రాజకీయ ఒత్తిళ్లను సైతం లెక్కచేయకుండా నిందితులపై కఠినంగా వ్యవహరించి, వృద్ధురాలికి బాసటగా నిలిచిన సీపీపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. మల్కాజ్‌గిరి ప్రాంతానికి చెందిన సదరు మహిళకు సుమారు రూ. 40 కోట్ల విలువైన ఖాళీ స్థలం ఉంది. దశాబ్దాలుగా ఆ భూమి ఆమె స్వాధీనంలోనే ఉన్నప్పటికీ, ఇటీవల కొందరు భూకబ్జాదారులు ఆ ఆస్తిపై కన్నేశారు. అక్రమంగా స్థలంలోకి చొరబడి, అది తమదేనంటూ సదరు వృద్ధురాలిని భయభ్రాంతులకు గురిచేశారు. ఈ క్రమంలో బాధిత మహిళ ధైర్యంతో మల్కాజ్‌గిరి సీపీ సుమతిని ఆశ్రయించారు. తన భూమికి సంబంధించిన అన్ని దస్తావేజులను సమర్పించి, న్యాయం చేయాలని ఆమెను అభ్యర్థించారు. వృద్ధురాలి ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన సీపీ సుమతి, సమగ్ర విచారణకు ఆదేశించారు. రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, ఆ భూమి బాధితురాలిదేనని ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే, ఈ వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధుల ద్వారా కబ్జాదారులు ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. అయినప్పటికీ సీపీ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా, ఆ స్థలం తమదేనని వాదిస్తున్న వారిని పిలిపించి ఆధారాలు సమర్పించాలని ఆదేశించారు. వారు సరైన పత్రాలను చూపలేకపోవడంతో, ఆ భూమి వృద్ధురాలిదేనని అధికారులు తుది నిర్ధారణకు వచ్చారు. కోట్లాది రూపాయల విలువైన తన ఆస్తి తిరిగి దక్కడంతో ఆ వృద్ధురాలు హర్షం వ్యక్తం చేశారు. సీపీ సుమతి ప్రదర్శించిన చొరవను, వృత్తిపరమైన నిబద్ధతను స్థానికులు కొనియాడుతున్నారు. భూకబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

## యువతే టార్గెట్.. రాహుల్ గాంధీ రాజకీయ
# వ్యూహంలో కొత్త మార్పు!



ఢిల్లీ: పెద్ద సభలు.. భారీ ప్రసంగాలు.. రాజకీయ నినాదాలు. ఇలాంటి సంప్రదాయ ప్రచారానికి భిన్నంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇప్పుడు యువతతో నేరుగా మాట్లాడుతున్నారు. ముఖ్యంగా జనరేషన్-జెడ్ (జెన్-జీ), యువతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వారితో ముఖాముఖి చర్చిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగానూ అదే తరహా సంభాషణకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

విద్యార్థుల సమస్యల నుంచి..

యువతను చేరుకునే ఈ ప్రయత్నం 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంతో మరింత ఊపందుకుంది. పోటీ పరీక్షల ఒత్తిడి, పేపర్ లీకులు, విద్యా వ్యవస్థలో జాప్యం వంటి సమస్యలపై ఇందులో చర్చలు జరిగాయి. కోటా, డెహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్ వంటి కేంద్రాల్లో మొదలైన ఈ కార్యక్రమం క్రమంగా విస్తరించింది.

యువతులపై ప్రత్యేక దృష్టి

ఇటీవల పూణెలో జరిగిన కార్యక్రమాల్లో రాహుల్ గాంధీ యువతుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. కెరీర్‌లో ఎదురయ్యే అడ్డంకులు, భద్రత, ఉద్యోగ ప్రదేశాల్లో పరిస్థితులు, కుటుంబం, సమాజం విధించే ఆంక్షలపై వారితో మాట్లాడారు.

సమాజం తమను ఎలా చూస్తోంది? భయాన్ని ఎలా ఉపయోగిస్తున్నారు? ఎలాంటి హింసను ఎదుర్కొంటున్నారు? అది ఎక్కడ జరుగుతోంది? వంటి అంశాలపై యువతులు తమ అనుభవాలను పంచుకోవాలని రాహుల్ కోరారు.

వ్యక్తిగత అనుభవాలే చర్చకు బాట

మహిళా సహచరులు పంచుకున్న వ్యక్తిగత అనుభవాలను కూడా రాహుల్ గాంధీ చర్చకు తీసుకొచ్చారు. శ్రద్ధ పేరుతో నియంత్రణ, చిన్న వయసులో పెళ్లి, పితృస్వామ్య భావజాలం, నైతిక పోలిసింగ్, భద్రత, వైద్య సదుపాయాల కొరత, వ్యక్తిగత నిర్ణయాలపై ఆంక్షల వంటి అంశాలు చర్చకు వచ్చాయి.

సోషల్ మీడియాలో కొత్త పంథా

డిజిటల్ వేదికల్లోనూ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రశ్నలు-సమాధానాలు, రీల్స్ వంటి సులభమైన ఫార్మాట్లతో యువతను చేరుకుంటున్నారు. గిగ్ ఎకానమీలో ఉద్యోగ భద్రత, మానసిక ఆరోగ్యం వంటి ఆధునిక సమస్యలపై మాట్లాడుతున్నారు. రాహుల్ గాంధీ వ్యూహంలో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అన్నారు. భారీ ప్రసంగాల నుంచి నేరుగా సంభాషణ వైపు ఆయన అడుగులు వేస్తున్నారు. యువత ఏం ఆలోచిస్తోంది? ఏ సమస్యలను ఎదుర్కొంటోంది? తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయ సంభాషణను ఏకపక్ష ప్రసంగం నుంచి రెండు వైపుల చర్చగా మార్చడమే ఈ వ్యూహం లక్ష్యంగా కనిపిస్తోంది.

# కుల్కచర్ల పిఎసిఎస్ చేర్మెన్ భీమ్ రెడ్డిని

## -సన్మానించిన వైస్ చైర్మన్ అశోక్



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): చౌడాపూర్ మండల ఉప బ్రాంచ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మొదటిసారి విచ్చేసిన పిఎసిఎస్ కులకచర్ల చేర్మెన్ భీమ్ రెడ్డి ని వైస్ చేర్మెన్ అశోక్ కుమార్ డైరెక్టర్లు దామోదర్ రెడ్డి. వెంకటయ్య లు ఘనంగా సన్మానిచ్చారు వ చేర్మెన్ ని చౌడాపూర్ మండలంలో రైతులకు రుణాలు సకాలంలో అందించి మండలంలో సొసైటీ నుంచి చౌడాపూర్ మండలంలో గోదాంలు. పెట్రోల్ బంక్ లు మంజూరు చేయాలి అని కోరారు ఈ కార్యక్రమంలో చౌడాపూర్ మండల సర్పంచ్ లు నవీన్ నరసింహ నాయక్. రవి నాయక్. మధుసూదన్ రెడ్డి. సలీం. సంతోష్. లాలూ నాయక్. బాల్రాజ్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంకుడు గుంతల నిర్మాణాలను ప్రోత్సహించాలి

## -పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్




వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): అవసరమైన చోట్ల ఇంకుడు గుంతలు నిర్మానించి వర్షపు నీటిని వృధా కాకుండా మళ్ళించడం ద్వారా భూగర్భ జలాలను పెంచవచ్చని పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్ అన్నారు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన ఇంకుడు గుంత నమూనాను పరిశీలించారు పట్టణంలో అవసరమైన చోట్ల ఇంకుడు గుంతల్ని నిర్మించాలని అధికారులకు సూచించారు ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా భూగర్భ జలాలను పెంచి నీటి వనరులని కాపాడవచ్చని తద్వారా నీటి సమస్యలను ఎదుర్కోకుండా భవిష్యత్తులో ఉపయోగపడుతుందని తెలిపారు ఇంకుడు గుంతల ద్వారా కలిగే ఉపయోగాలను ప్రజలందరికీ వివరించాలని కోరారు ఈ కార్యక్రమంలో డి ఈ సాయికుమార్, మహేందర్ కౌన్సిలర్లు యూసుఫ్, రవికుమార్ పాల్గొన్నారు

# పూర్తయిన ఇందిరమ్మ ఇల్లును పరిశీలించిన

## - మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకట రాములు



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పరిగి మండల పరిధిలోని గడి సింగపూర్ గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను మండల పార్టీ అధ్యక్షుడు జి వెంకట రాములు సందర్శించారు. ఇప్పటికీ పూర్తయిన ఇళ్లను ఇంకా కావాల్సిన ఇళ్లను ఇంకా కొత్తగా కావాల్సిన వారు ఎవరైనా ఉంటే ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రోజా గ్రామ సర్పంచ్ అలవేలు నరసింహ ఉపసర్పంచ్ మైపాల్ వార్డు సభ్యులు శ్రీనివాస్ యాదయ్య చరణ్లు ఎస్ ప్రభు గ్రామ కార్యదర్శి మొగులయ్య తదితరులు పాల్గొన్నారు

# పోలీస్ సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారంలో పోలీస్ అసోసియేషన్ కీలక పాత్ర

## - వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా,




వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ సబ్ డివిజన్‌లలో జిల్లా పోలీస్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించబడ్డాయి. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, నిర్వహించిన ఎన్నికల ప్రక్రియను పరిశీలించి, ఎన్నికల ఏర్పాట్లు మరియు నిర్వహణ తీరుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం మరియు వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో పోలీస్ అసోసియేషన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఎన్నికల ప్రక్రియలో భాగంగా 50 మంది పురుష పోలీస్ సిబ్బందికి ఒక ప్రతినిధిని, 40 మంది మహిళా సిబ్బంది కలసి ఒక ప్రతినిధి ని ఎన్నుకుంటారు. అనంతరం ఎన్నికైన ప్రతినిధులందరూ కలిసి జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకుంటారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, జనయ్య; శ్రీనివాస్; ఇన్స్పెక్టర్లు నాగార్జున, జములప్ప; ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.




# విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను వేగవంతం చేయాలి - జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): జిల్లాలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచడంతో పాటు, ఆధార్ అనుసంధానం, ఆఫర్ జనరేషన్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మండల విద్యాశాఖాధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో శు క్రవారం జిల్లాలోని అన్ని మండలాల మండల విద్యాశాఖాధికారులతో విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, ఆధార్ నమోదు/అనుసంధానం, ఆఫర్ జనరేషన్ ప్రగతిని సమీక్షించారు. ప్రతి మండల విద్యాశాఖాధికారికి నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ప్రీ-ప్రైమరీ తరగతుల ఎన్‌రోల్‌మెంట్‌తో పాటు 1వ తరగతి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థుల నమోదు ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా సంబంధిత పాఠశాలల




ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఆధార్ ఆఫర్ జనరేషన్ ప్రక్రియలను వెంటనే పూర్తి చేసి, సంబంధిత ఆన్‌లైన్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని తెలిపారు. వికారాబాద్ జిల్లాను విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌లో రాష్ట్రంలో ముందువరుసలో నిలిపే విధంగా ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. అదేవిధంగా, విద్యార్థుల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ సామర్థ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని లకు సూచించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం మరియు ప్రాథమిక గణిత నైపుణ్యాలను సాధించేలా పాఠశాల స్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మండల విద్యాధికారి ప్రతి నెల తప్పనిసరిగా కనీసం 15 పాఠశాలలను సందర్శించి, పాఠశాలల్లో విద్యా బోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, ప్రగతి మరియు ఇతర అకాడమిక్ అంశాలను సమగ్రంగా పరిశీలించాలని, పాఠశాలలను సందర్శించిన సందర్భంగా అకాడమిక్ రిజిస్టర్‌లో నమోదు చేసిన సూచనలు, సమస్యలు మరియు నిర్దేశించిన చర్యలు తదుపరి సందర్శన సమయంలో అమలు అయ్యాయా లేదా అనే అంశాన్ని తప్పనిసరిగా సమీక్షించాలని సూచించారు. గత సందర్శనలో సూచించిన అంశాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు తీసుకున్న చర్యలను పరిశీలించి, పెండింగ్ అంశాలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలపై ప్రతిరోజూ ప్రగతిని సమీక్షిస్తూ, పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిగా సాధించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

# వికారాబాద్ జిల్లాలో ఉలిసాకు ప్రభుత్వం ప్రోత్సహం

## - జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి సత్తార్



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): వికారాబాద్ జిల్లాలో ఉల్లి సాగును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం - ఎకరాకు రూ.8,000 సబ్సిడీ, ఉల్లి నిల్వ నిర్మాణానికి రూ.1 లక్ష సహాయం వికారాబాద్ జిల్లాలో ఉల్లి సాగుకు అనుకూల పరిస్థితులు ఉన్నందున రైతులు ఉల్లి సాగును చేపట్టి అధిక ఆదాయం పొందాలని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి ఎం.ఏ. సత్తార్ సూచించారు. ఉల్లి సాగు రైతులను ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.8,000/- సబ్సిడీ అందిస్తున్నదని తెలిపారు.

### ఉల్లి సాగుకు అనుకూల నేలలు

ఉల్లి సాగుకు మంచి నీటి పారుదల కలిగిన ఎర్ర నేలలు, ఇసుక లోమి నేలలు లోమి నేలలు అనుకూలంగా ఉంటాయి. నీరు నిలిచే నేలలను నివారించాలి. నేల 6.5-7.5 మధ్య ఉండటం ఉల్లి సాగుకు అనుకూలం.

### విత్తన మోతాదు

ఎకరాకు సుమారు 4-5 కిలోల నాణ్యమైన ఉల్లి విత్తనం అవసరం. ప్రాంతానికి, సాగు రకానికి నారు పెంపకం పద్ధతిని బట్టి విత్తన మోతాదులో స్వల్ప మార్పు ఉండవచ్చు.

### నారు మడి తయారీ నిర్వహణ

ఎంపిక చేసిన భూమిలో నీరు నిల్వ ఉండకుండా ఎత్తైన నారు మడులను ఏర్పాటు చేసుకోవాలి. బాగా కుళ్లిన పశువుల ఎరువును



కలిపి నేలను మెత్తగా తయారు చేయాలి. విత్తనాలను పలుచగా విత్తి, తేలికగా మట్టితో కప్పాలి. నారు మడిలో అవసరమైనంత మేరకు నీటిని అందిస్తూ కలుపు మొక్కలను తొలగించాలి. అధిక తేమ వల్ల వచ్చే తెగుళ్లను నివారించేందుకు సరైన నీటి పారుదల ఉండేలా చూడాలి.

సాధారణంగా 45--50 రోజుల వయస్సు గల ఆరోగ్యకరమైన నారును ప్రధాన పొలంలో నాటుకోవచ్చు.

### ప్రధాన పొలంలో నాటడం

ప్రధాన పొలాన్ని బాగా దున్ని మెత్తగా తయారు చేసి, అవసరమైన సేంద్రియ ఎరువులను వినియోగించాలి. సుమారు 15 సెం.మీ. వరుసల మధ్య దూరం, 10 సెం.మీ. మొక్కల మధ్య దూరం పాటిస్తూ నాటుకోవాలి. డ్రిప్ సేద్యం ద్వారా అవసరమైన మేరకు నీటిని అందించడం ద్వారా నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచి, మంచి దిగుబడులు పొందవచ్చు.

### ఎకరాకు దిగుబడి

సమతుల్య ఎరువుల వినియోగం, సరైన నీటి యాజమాన్యం, కలుపు కీటక--తెగుళ్ల నియంత్రణ వంటి శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటించినట్లయితే ఎకరాకు సుమారు 80--120 క్వింటాళ్ల వరకు ఉల్లి దిగుబడి పొందే అవకాశం ఉంటుంది. వాతావరణం, రకం, నేల స్వభావం యాజమాన్య పద్ధతుల ఆధారంగా దిగుబడిలో మార్పులు ఉండవచ్చు.

### ఉల్లి నిల్వ నిర్మాణం - రైతులకు అదనపు ఆదాయానికి అవకాశం

ఉల్లి పంటలో రైతులకు ఎదురయ్యే ప్రధాన సమస్యల్లో మార్కెట్ ధరల హెచ్చుతగ్గులు ఒకటి. పంట కోత సమయంలో మార్కెట్లో ధరలు తక్కువగా ఉన్నప్పుడు రైతులు తమ పంటను వెంటనే విక్రయించకుండా, శాస్త్రీయంగా నిర్మించిన ఉల్లి నిల్వ నిర్మాణంలో నిల్వ చేసుకుని, మార్కెట్లో మంచి ధరలు వచ్చినప్పుడు విక్రయించుకోవచ్చు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉల్లి నిల్వ నిర్మాణాలను ప్రోత్సహించేందుకు ఒక్కో యూనిట్‌కు 25 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో ఏర్పాటు చేసుకునే యూనిట్‌కు రూ.1,00,000/- సబ్సిడీ అందిస్తోంది.

### ఉల్లి నిల్వ నిర్మాణం వల్ల ప్రయోజనాలు

మార్కెట్లో ధరలు తక్కువగా ఉన్నప్పుడు ఉల్లిని నిల్వ చేసుకోవచ్చు.

ధరలు పెరిగినప్పుడు పంటను విక్రయించి అధిక ఆదాయం పొందవచ్చు.

కోత అనంతరం వెంటనే తక్కువ ధరకు విక్రయించాల్సిన అవసరం తగ్గుతుంది.

సరైన గాలి ప్రసరణ కలిగిన నిల్వ నిర్మాణంలో ఉల్లిని ఉంచడం ద్వారా కుళ్ళిపోవడం, మొలకెత్తడం నిల్వ నష్టాలను తగ్గించవచ్చు

నాణ్యతను కొంతకాలం కాపాడుతూ అవసరమైన సమయంలో దశలవారీగా మార్కెట్‌కు తరలించవచ్చు.

మార్కెట్ ధరలను గమనించి రైతు తనకు అనుకూలమైన సమయంలో విక్రయించే అవకాశం పొందుతాడు.

పంట అనంతర నష్టాలు తగ్గడం ద్వారా రైతు నికర ఆదాయం పెంచుకునే అవకాశం ఉంటుంది.

### ఉల్లి సాగు సబ్సిడీ - రైతులు దరఖాస్తు చేసుకోవాలి

ఉల్లి సాగు చేస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎకరాకు రూ.8,000/- సబ్సిడీను అర్హత కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి ఎం.ఏ. సత్తార్ కోరారు.

### దరఖాస్తుకు అవసరమైన పత్రాలు:

1. పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్
2. ఆధార్ కార్డు జిరాక్స్
3. బ్యాంక్ ఖాతా వివరాలు/బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్
4. పాస్‌పోర్ట్ సైజు ఫోటో

### దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ: 29-08-2026.

ఉల్లి సాగు చేస్తున్న రైతులు ప్రభుత్వం అందిస్తున్న సాగు సబ్సిడీతో పాటు ఉల్లి నిల్వ నిర్మాణ సబ్సిడీని కూడా సద్వినియోగం చేసుకొని పంటను తక్కువ ధరలకు విక్రయించకుండా శాస్త్రీయంగా నిల్వ చేసి, మంచి ధర లభించినప్పుడు మార్కెట్ చేయడం ద్వారా అధిక ఆదాయం పొందాలని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి విజ్ఞప్తి చేశారు.

### ముఖ్య గమనిక:

గత సంవత్సరం ఉల్లి సాగుకు సబ్సిడీ పొందిన/దావా చేసిన రైతులు ఈ సంవత్సరం మళ్లీ ఉల్లి సాగు సబ్సిడీని పొందేందుకు అర్హులు కారు. కొత్తగా అర్హత కలిగిన రైతులు మాత్రమే నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలి. రైతులు నిర్ణీత గడువులోగా సంబంధిత ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# నూకపల్లి 2బీహెచ్‌కే కాలనీలో లబ్ధిదారులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తాం ....

## రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

## రోడ్లు, సెల్ టవర్, నీటి వసతులు, పాఠశాల, ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని హామీ

## లబ్ధిదారులతో కలిసి నూతన గృహప్రవేశం చేసిన మంత్రి పొంగులేటి

జగిత్యాల జిల్లా,ఆగస్టు 21, - నూకపల్లి 2బీహెచ్‌కే గృహ సముదాయంలో నివసిస్తున్న లబ్ధిదారులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించి, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం నూకపల్లి 2బీహెచ్‌కే గృహ సముదాయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగుల, ట్రాన్స్‌జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సి.సి.ఎల్.ఏ. కమిషనర్ లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ స్పెషల్ సెక్రటరీ రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ ఎం.డి. గౌతమ్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌లతో కలిసి మంత్రి పరిశీలించారు. మిషన్ భగీరథ ట్యాంక్ పైకి వెళ్లి అక్కడి నుంచి నూకపల్లి గృహ సముదాయాన్ని పరిశీలించిన అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి లబ్ధిదారులతో కలిసి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి కాలనీలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



### మౌలిక వసతుల పనులు పూర్తి

నూకపల్లి 2బీహెచ్‌కే కాలనీలో ఇళ్లతో పాటు అవసరమైన మౌలిక వసతుల పనులను కూడా చేపట్టినట్లు మంత్రి తెలిపారు. 160 ఇళ్ల ప్రాంతంలో సెప్టిక్ ట్యాంకులు, వాటర్ డ్రెయిన్, సీవరేజ్ లైన్ల నిర్మాణానికి రూ.52.57 లక్షలు మంజూరు చేసి రూ.51.09 లక్షలు వ్యయం చేశారని తెలిపారు. 360 ఇళ్ల ప్రాంతంలో ఇదే తరహా పనులకు రూ.99.25 లక్షలు మంజూరు చేసి రూ.88.48 లక్షలు వ్యయం చేసినట్లు వివరించారు. 4,000 ఇళ్ల ఫేజ్-2 ప్రాంతంలో సెప్టిక్ ట్యాంకులు, సీవరేజ్ లైన్లు, ఇన్‌స్పెక్షన్ చాంబర్లు, వాటర్ డ్రెయిన్లు, మెయిన్ డ్రెయిన్, అంతర్గత డ్రెయిన్ల నిర్మాణానికి రూ.11.30 కోట్ల మేర నిధులు మంజూరు కాగా, రూ.10.81 కోట్ల మేర వ్యయం చేసినట్లు తెలిపారు. 4,000 ఇళ్ల ప్రాంతంలో విద్యుత్ లైన్లు, ఎలక్ట్రికల్ ప్యానల్ బోర్డుల ఏర్పాటుకు రూ.6.05 కోట్లు మంజూరు చేసి రూ.5.01 కోట్లు వ్యయం చేసినట్లు తెలిపారు. 4,000 ఇళ్ల ప్రాంతంలో సెప్టిక్ ట్యాంకులు, సీవరేజ్ లైన్లు, సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయిన్ల పనులకు రూ.5 కోట్లు మంజూరు చేసి రూ.4 కోట్లు వ్యయం చేసినట్లు వివరించారు. 4,520 ఇళ్లకు మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా పనులు పూర్తి చేసినట్లు మంత్రి తెలిపారు. కాలనీలో ఇప్పటికే పలు మౌలిక వసతుల పనులు పూర్తయ్యాయని, మిగిలిన అవసరాలను కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

### లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్న మంత్రి

నూకపల్లి 2బీహెచ్‌కే కాలనీలో లబ్ధిదారులతో మంత్రి నేరుగా మాట్లాడారు. కాలనీలో రోడ్లు, సెల్ టవర్, తాగునీటి వసతులు, పాఠశాల, ఆసుపత్రి వంటి సౌకర్యాలు కల్పించాలని లబ్ధిదారులు మంత్రిని కోరారు.లబ్ధిదారులు తెలిపిన సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. రోడ్లు, సెల్ టవర్, నీటి వసతులు, పాఠశాల, ఆసుపత్రి వంటి అవసరమైన మౌలిక సదుపాయాలను మూడు నెలల్లోగా అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

### అంగన్‌వాడీ కేంద్రంలో వసతులపై ఆరా

అనంతరం నూకపల్లి 2బీహెచ్‌కే కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పరిశీలించారు. కేంద్రంలో ఉన్న చిన్నారుల కు అక్షరాభ్యాసం చేశారు.పిల్లల సంఖ్య, వారికి అందుతున్న వసతులు, ఇంకా అవసరమైన సౌకర్యాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు మెరుగైన వాతావరణం కల్పించేలా అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

### కాలనీలో అన్ని సౌకర్యాలు కల్పించాలి

2బీహెచ్‌కే ఇళ్ల నిర్మాణంతో పాటు కాలనీల్లో అవసరమైన రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. లబ్ధిదారులు సౌకర్యవంతంగా జీవించేలా నూకపల్లి 2బీహెచ్‌కే కాలనీలో మిగిలిన అవసరాలను కూడా ప్రాధాన్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

# ఆటోలపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు

**21 ఆటోలు గుర్తింపు.. జరిమానా**

**ట్రాఫిక్ నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన, కౌన్సెలింగ్**

**నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు – ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్**




కర్నూలు, ఆగస్టు 21: (మహి న్యూస్): కర్నూలు నగరంలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను అరికట్టేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్



ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం సి. క్యాంప్ ప్రాంతంలో ఆటోలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 21 ఆటోలను గుర్తించి జరిమానాలు విధించారు. ఆటో డ్రైవర్లకు వాహన బీమా, డ్రైవింగ్ లైసెన్స్, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా నియమాలపై పోలీసులు అవగాహన కల్పించారు. అలాగే నిబంధనలపై కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను తమ వెంట ఉంచుకోవాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వాహనాలను నిర్లక్ష్యంగా నడపకుండా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని స్పష్టం చేశారు. నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

# 22, 23 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు..

కడప, మహి న్యూస్ ఆగస్టు 21: ఎస్ఐఆర్-2026లో భాగంగా ఈ నెల 22, 23 తేదీల్లో కడప నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు, ప్రచార శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కడప ఆర్డీవో, నియోజకవర్గ ఎన్నికల అధికారి (ఈఆర్ఓ) మురళి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్ఓలు అందుబాటులో ఉంటారని, అర్హులైన కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితాలో పేర్ల పరిశీలన, సవరణలు, అభ్యంతరాల స్వీకరణకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా 18--19 ఏళ్ల యువతతో పాటు ముసాయిదా జాబితాలో పేర్లు లేని అర్హులైన పౌరులు ఈ 22, 23 తేదీల ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో మురళి కోరారు.

# శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం



గుంటూరు, మహి న్యూస్, ఆగస్టు 21 : ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని శని,ఆదివారాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ నెల 22, 23 తేదీలలోనూ, 29, 30 తేదీల్లోను ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత బూత్ లెవెల్ అధికారులు (బి.ఎల్.ఓ) ఆయా రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని అన్నారు. ముసాయిదా ఓటరు జాబితా బి.ఎల్.ఓల వద్ద లభ్యంగా ఉందని, ఓటర్లు తమ ఓటు వివరాలను ముసాయిదా ఓటరు జాబితాలో పరిశీలించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకొనుటకు, వివరాల్లో మార్పులు, చేర్పులు, సవరణలు చేయుటకు సంబంధిత పోలింగ్ కేంద్రంలో బిఎల్ఓలను సంప్రదించి ఫారం 6, 7 లేదా 8 అందించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటును పదిలపరచుకోవాలని కోరారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి వచ్చే వారికి స్పష్టమైన సమాచారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# సామాజిక ఆసుపత్రిని త్వరలో వంద పడకల ఆసుపత్రిగా మార్పు



కోటబొమ్మాళి, మహి న్యూస్, ఆగస్టు 21: కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రిని త్వరలో వంద పడకల స్థాయి ఆసుపత్రిగా అభివృద్ధికి కృషి చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం లో నాబార్డ్ నిధులు రూ.290 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన ప్రసూతి, శిశు ఆరోగ్య కేంద్రం బ్లాక్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను పెంచేలా అవగాహ కల్పించి ఆరోగ్య భద్రతకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి సూచించారు. ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.ఆసుపత్రి నిర్వహణ, పరిశుభ్రమైన వాతావరణం, పారిశుద్ధ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రోగులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహమ్మద్ ఖాన్, ఆర్డీఓ ఎం. కృష్ణమూర్తి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా. విజయలక్ష్మి, మాజీ పి ఏ సి ఎస్ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఝాన్సీ లక్ష్మి, మెడికల్ ఆఫీసర్లు పి. గణేష్, వైద్యులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపాడు గురుకుల బాలికల పాఠశాలను సందర్శించిన ఉన్నతాధికారులు




శ్రీకాకుళం, మహి న్యూస్, ఆగస్టు 21: పెద్దపాడు డా.బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలను గురువారం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.ఎం. నాయక్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ లు సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, వారి విద్యాభ్యాసం, సౌకర్యాలు, పాఠశాల కార్యకలాపాలపై ఆరా తీశారు. అనంతరం ఏటీఎల్ ల్యాబ్ ను సందర్శించి, విద్యార్థుల సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనా విధానం, నూతన ఆవిష్కరణలపై పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా మాట్లాడి, విద్యార్థుల విద్యా ప్రగతి, బోధనా విధానాలు, పాఠశాల ఫలితాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులలో విద్యా ప్రమాణాలను మరింత





పెంపొందించేందుకు, మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు సమిష్టి కృషి చేయాలని పలు విలువైన సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వారి ప్రతిభను వెలికితీసేలా ప్రోత్సాహం అందించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ హరిఓం పాండ్య , శ్రీకాకుళం ఆర్డీఓ కె. సాయి ప్రత్యూష, , టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి, డిప్యూటీ డైరెక్టర్ కె. వినాయకం, జిల్లా సమన్వయ అధికారి వై. యశోదలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# అంజీర్ సాగుతో ఆరోగ్యం.. ఆదాయం

**డా. ముచ్చుకోట సురేష్ బాబు**





అనంతపురం మహి న్యూస్ ఆగస్టు 21.: ఎల్‌నినో ప్రభావంతో అనంతపురం జిల్లాలో వర్షపాతం తగ్గి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్న నేపథ్యంలో, తక్కువ నీటితో సాగు చేయగలిగే, మంచి దిగుబడి మరియు ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో అంజీర్ సాగు అనంతపురం ప్రాంత రైతులకు ఒక మంచి అవకాశంగా కనిపిస్తోంది.గత నాలుగు నెలల్లో కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం గణనీయంగా పడిపోయిన పరిస్థితుల్లో, నీటి అవసరం తక్కువగా ఉండే పంటలను ఎంపిక చేయడం కీలకంగా మారింది. వేడి, పొడి వాతావరణాన్ని తట్టుకోగల అంజీర్ మొక్కలు అనంతపురం నేలలు, వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ఉండే అవకాశం ఉంది.

## గుత్తి ప్రాంతంలో డయానా రకం సాగు

గుత్తి మండలం వన్నెదొడ్డి ప్రాంతంలో డయానా రకం అంజీర్‌ను శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. అక్కడ మంచి నాణ్యత కలిగిన అంటుకట్టిన మొక్కలను తయారు చేసి రైతులకు అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నాణ్యమైన మొక్కలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా అంజీర్ సాగును మరింత విస్తరించవచ్చు.అంజీర్ (ఫికస్ కారిక ) ప్రపంచంలోని పురాతన పండ్లలో ఒకటి. రుచి, పోషక విలువల కారణంగా దీనికి ప్రత్యేకమైన మార్కెట్ ఉంది. తాజా అంజీర్‌లో నీటి శాతం అధికంగా ఉండగా, ఎండిన అంజీర్‌లో సహజ చక్కెరలు, పీచు, కాల్షియం, పొటాషియం, ఇనుము, మెగ్నీషియం, విటమిన్ ఏ, సి వంటి పోషకాలు లభిస్తాయి.అంజీర్‌లోని పీచు జీర్ణక్రియకు, మలబద్ధకం నివారణకు సహాయపడుతుంది. కాల్షియం, పొటాషియం వంటి ఖనిజాలు ఎముకల ఆరోగ్యానికి ఉపయోగకరంగా ఉంటాయి. అయితే ఎండిన అంజీర్‌లో సహజ చక్కెరలు అధికంగా ఉండే అవకాశం ఉన్నందున పరిమిత మోతాదులో తీసుకోవడం మంచిది.

## డయానా రకానికి ప్రత్యేకత

డయానా అంజీర్ రకం రైతులు, ఇంటి తోటల పెంపకందారుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ రకం పెద్ద పరిమాణంలో పసుపు-ఆకుపచ్చ రంగు పండ్లను, తియ్యటి అంబర్-ఎరుపు గుజ్జును ఇస్తుంది. నాణ్యమైన టిష్యూ కల్చర్ లేదా అంటుకట్టిన మొక్కలు అనుకూల పరిస్థితుల్లో సుమారు 10--12 నెలల్లో కాపు ప్రారంభించే అవకాశం ఉంది.అంజీర్‌కు రోజుకు 6--8 గంటల సూర్యకాంతి అవసరం. నీరు నిల్వ ఉండకుండా మంచి డ్రైనేజీ కలిగిన నేలలో నాటాలి. వేడి, ఎండ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులతో మంచి ఫలితాలు సాధించవచ్చు.

## రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయం

అనంతపురం వంటి కరువు ప్రభావిత ప్రాంతాల్లో నీటి లభ్యత రోజురోజుకూ తగ్గుతున్న నేపథ్యంలో, తక్కువ నీటి అవసరం ఉన్న ఉద్యాన పంటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. అంజీర్‌తో పాటు డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్, సేంద్రియ ఎరువుల వినియోగం వంటి పద్ధతులను అనుసరిస్తే నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు.తాజా పండ్లతో పాటు ఎండిన అంజీర్‌కు కూడా మార్కెట్ ఉండటం ఈ పంటకు అదనపు ప్రయోజనం. శాస్త్రీయ సాగు పద్ధతులు, నాణ్యమైన మొక్కలు, మార్కెటింగ్ సదుపాయాలు అందుబాటులోకి వస్తే అంజీర్ అనంతపురం రైతులకు ప్రత్యామ్నాయ



ఆదాయ వనరుగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.కరువు పరిస్థితులను అధిగమించేందుకు ప్రతి ఎకరాకు అధిక నీరు అవసరమయ్యే పంటలకే పరిమితం కాకుండా, తక్కువ నీటితో అధిక విలువను సృష్టించే పంటల వైపు రైతులు మళ్లడం కాలానుగుణ అవసరం. అంజీర్ సాగు ఆ దిశగా ఒక ఆశాజనకమైన మార్గంగా నిలవవచ్చు.

# మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 'ఆర్టిస్ట్రీ' ప్రత్యేక ఆభరణాల ప్రదర్శన

అమలాపురం,మహి న్యూస్,ఆగస్టు 21: ఆభరణాల్లో కళాత్మకత, సంప్రదాయం, ఆధునికతకు ప్రాధాన్యమిస్తూ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ అమలాపురం షోరూంలో 'ఆర్టిస్ట్రీ' పేరుతో ప్రత్యేక ఆభరణాల ప్రదర్శనను నిర్వహిస్తోంది. ఆగస్టు 21 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఈ ప్రదర్శన కొనసాగనుంది. 'ప్రతి ఆభరణంలోనూ కళ' అనే భావనతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో బంగారు ఆభరణాలు, వజ్రాభరణాలు, ముడి వజ్రాలతో రూపొందించిన ప్రత్యేక ఆభరణాలు, జాతిరత్నాభరణాలు కొలువుదీరాయి. అత్యంత నైపుణ్యంతో రూపొందించిన ప్రతి ఆభరణం కళాకారుల సృజనాత్మకతకు, అనుభవానికి ప్రతీకగా నిలుస్తోంది. వివాహాలు, వేడుకలు, ప్రత్యేక సందర్భాలకు అనువైన ధ్రువీకరించిన వజ్రాభరణాలతో పాటు ముడి వజ్రాలతో రూపొందించిన ప్రత్యేక ఆభరణాలు, జాతిరత్నాలతో తయారు చేసిన నగలు, సంప్రదాయ హస్తకళను ప్రతిబింబించే డిజైన్లు, తేలికపాటి ఆధునిక ఆభరణాలు, భారతీయ సంప్రదాయ శైలిని ప్రతిబింబించే నగలు, చిన్నారుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఆభరణాలను ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. 'ఆర్టిస్ట్రీ' ప్రదర్శన సందర్భంగా వినియోగదారులకు ప్రత్యేక రాయితీలను ప్రకటించారు. ముడి వజ్రాలు, జాతిరత్నాలతో కూడిన ఆభరణాల తయారీ రుసుముపై 30 శాతం వరకు తగ్గింపు అందిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ ప్రత్యేక అవకాశం






సెప్టెంబర్ 14, 2026 వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారుల విశ్వాసానికి ప్రాధాన్యమిస్తూ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ పారదర్శక ధరల విధానాన్ని అమలు చేస్తోంది. ఆభరణాల తయారీ రుసుము, రాళ్ల బరువు, నికర బరువు, రాళ్ల విలువ తదితర వివరాలను స్పష్టంగా తెలిపే ధరల పట్టికను వినియోగదారులకు అందిస్తోంది. పాత బంగారు ఆభరణాలను తిరిగి విక్రయించే సమయంలో బంగారానికి పూర్తి విలువ, బంగారం మార్పిడిపై ఎలాంటి తగ్గింపు లేకపోవడం, వజ్రాభరణాల మార్పిడికి పూర్తి విలువ, నూరు శాతం స్వచ్ఛతకు సంబంధించిన గుర్తింపు కలిగిన బంగారం, వజ్రాల నాణ్యతకు అంతర్జాతీయ ప్రమాణాల పరీక్షలు, జీవితకాల ఉచిత నిర్వహణ, తిరిగి కొనుగోలు హామీ వంటి సేవలను సంస్థ అందిస్తోంది. అలాగే ఆభరణాల నాణ్యతను వినియోగదారుల సమక్షంలో పరిశీలించేందుకు ప్రత్యేక పరికరాలను కూడా అందుబాటులో ఉంచుతున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. మలబార్ గ్రూప్‌కు చెందిన ప్రధాన సంస్థగా 1993లో కేరళలో ప్రారంభమైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో విస్తరించింది. భారతదేశంతో పాటు ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్, అమెరికా, మధ్యప్రాచ్య దేశాలు, తూర్పు ఆసియా తదితర ప్రాంతాల్లో సంస్థ వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ప్రస్తుతం 14 దేశాల్లో 450కి పైగా షోరూంలు, తయారీ కేంద్రాలతో విస్తృతమైన వ్యాపార నెట్వర్క్‌ను కలిగి ఉన్నట్లు సంస్థ తెలిపింది. ఈ నేపథ్యంలో అమలాపురం ప్రజలు ఆగస్టు 21 నుంచి 24వ తేదీ వరకు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో నిర్వహిస్తున్న 'ఆర్టిస్ట్రీ' ప్రత్యేక ఆభరణాల ప్రదర్శనను సందర్శించి, తమ అభిరుచికి, అవసరానికి తగిన ఆభరణాలను ఎంపిక చేసుకోవాలని సంస్థ ప్రతినిధులు కోరారు.

# డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ!

విజయవాడ, మహి న్యూస్, ఆగస్టు 21 : డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ (రెగ్యులరైజేషన్) ప్రక్రియ విజయవంతం కావడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తమ చిరకాల స్వప్నాన్ని సాకారం చేసేందుకు అలుపెరగని కృషి చేసిన ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏ. విద్యాసాగర్, కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం విజయవాడలోని ఎన్జీవో హోమ్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తమ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన నాయకత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు మరియు అభినందనలు తెలియజేశారు.




## కీలక పాత్ర పోషించిన 'సాగర్-రమణ' నాయకత్వం:

ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ... ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంశాన్ని ఎన్జీవో రాష్ట్ర నాయకత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని కొనియాడారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో అధ్యక్షుడు విద్యాసాగర్ నిరంతరం శ్రమించారని తెలిపారు. వారి ప్రత్యేక చొరవతోనే ముఖ్యమంత్రి ఆమోదం, క్యాబినెట్ ఆమోదం లభించడమే కాకుండా, అసెంబ్లీలో బిల్లు పాస్ అయిందని గుర్తుచేశారు. ఆ తర్వాత డిపార్ట్‌మెంట్ ప్రాసెస్ చట్ట సవరణ (అమెండ్మెంట్) ద్వారా సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు మార్గం సుగమమైందని వారు స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్జీవో సంఘం చొరవతో 8000 మంది కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కి మార్గం ముఖ్యమంత్రి ఆమోదంతో సగం అయిందని, ఇప్పుడు యాక్ట్ 30 సవరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం లభించడంతో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్కు కూడా మార్గం సుగమం అయిందని తెలిపారు.

## ముఖ్యమంత్రి, మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు:

ఏళ్ల తరబడి వేచి చూస్తున్న ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపి, వారి కుటుంబాలకు భరోసా కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్థిక శాఖమాత్యులు పయ్యావుల కేశవ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, శాఖాధికారులకు మరియు సంబంధిత ప్రభుత్వ యంత్రాంగానికి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు సమర్పించారు.

## కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు:

ఈ కృతజ్ఞతా కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కరెడ్ల అంజనీ కుమార్, కార్యదర్శి శ్రీదేవి, సహాయ కార్యదర్శితో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి భారీ సంఖ్యలో విచ్చేసిన కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఎన్జీవో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 26న క్రియా యూనివర్సిటీలో రీజనల్ పార్టనర్‌షిప్ సమ్మిట్

### వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈఓ ఎం విశ్వ

తిరుపతి, మహి న్యూస్, ఆగస్టు 21 : ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈఓ ఎం విశ్వ ఈరోజు తిరుపతి జిల్లాల కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌తో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అక్టోబర్ 26న క్రియా యూనివర్సిటీ శ్రీ సిటీ లో ప్రధాన రంగాలు పర్యటకం మరియు ఆదిత్య రంగం, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు మరియు అధునాతన మెటీరియల్స్, ఆటోమోటివ్, అంతరిక్ష రంగం, ఫుట్ వేర్ మొదలగునవి ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'రీజనల్ పార్టనర్‌షిప్ సమ్మిట్' ముందస్తు ఏర్పాట్లపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సమ్మిట్‌లో ఎంఎస్ఎంఈలు, ఆర్‌టిఐహెచ్ కు చెందిన పలు స్టార్టప్‌ల ఉత్పత్తులను ప్రదర్శించేందుకు గాను ప్రత్యేకంగా 30 స్టాళ్లను ఏర్పాటు చేయాలని సీఈఓ సూచించారు. సమ్మిట్ సన్నాహకాల్లో భాగంగా సెప్టెంబర్ 10వ తేదీలోగా తిరుపతిలో ప్రత్యేక ఎంఎస్ఎంఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాల సమర్ధవంతమైన నిర్వహణ కోసం మెప్మా పిడి, డిఆర్‌డిఏ పిడిలను నోడల్ అధికారులుగా కలెక్టర్ నియమించారు. సెప్టెంబర్ 10వ తేదీలోగా ఏర్పాటు చేసే ఈ కార్యక్రమానికి సమ్మిట్ ద్వారా ఎంఎస్ఎంఈ ప్రమోటర్లు, స్టార్టప్‌లు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో సహా దాదాపు 500 మంది భాగస్వాములను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సమ్మిట్‌ను విజయవంతం చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీఎం డిఐసి జి చంద్రశేఖర్, జెడ్ఎమ్ ఏపీఐఐసీ విజయ్ భరత్ రెడ్డి, డి ఆర్ డి ఏ, మెప్మా పీడీలు, తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ 629 ఏఈఈ పోస్టులకు 1.05 లక్షల అభ్యర్థులు



### పారదర్శకంగా ఏఈఈల నియామక పరీక్షలు
### 23 నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్షలు
### ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి

విజయవాడ, మహి న్యూస్, ఆగస్టు 21 : రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి ఈ నెల 23 నుంచి 27 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి తెలిపారు. పరీక్షలను పూర్తి పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పరీక్షలు రోజుకు రెండు షిఫ్టుల్లో జరుగుతాయి. మొదటి షిఫ్ట్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. అభ్యర్థులు ఒరిజినల్ హాల్‌టికెట్‌తో పాటు ఆధార్, పాన్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్ లేదా డ్రైవింగ్ లైసెన్స్ వంటి ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో ఫేస్ వెరిఫికేషన్, మెటల్ డిటెక్టర్‌తో తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, కాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, పుస్తకాలు, కాగితాలు అనుమతించబోమన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామంటూ దళారులు చేసే ప్రచారాన్ని నమ్మొద్దని, అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని సీఎండీ సూచించారు.

# కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల చట్టబద్ధతపై హైకోర్టులో జరిగిన విచారణ

తెలంగాణ, ఆగస్టు 21,: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల చట్టబద్ధతపై హైకోర్టులో విచారణ జరిగింది. ఉచిత పథకాల వల్ల ఆర్థిక సమస్యలు వస్తాయని హైకోర్టు మరోసారి అభిప్రాయపడింది. ఇదే రకమైన అభిప్రాయాన్ని గతంలోనూ హైకోర్టు ఈ రెండు పథకాలపై స్టే విధిస్తూ వ్యాఖ్యానించింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై స్టేను తొలగించాలని తెలంగాణ ప్రభుత్వం హైకోర్టులో పిటీషన్ వేసింది.కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై.ఈ విచారణ సందర్భంగా న్యాయ స్థానం పదవీ విరమణ తర్వాత ఉద్యోగులకు బెనిఫిట్స్ అందడం లేదని, పెన్షన్లు, బెనిఫిట్స్ అందక చాలామంది కోర్టును ఆశ్రయిస్తు న్నారని హైకోర్టు అభిప్రాయప డింది. ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్‌లో వివరాలు లేవని హైకోర్టు చెప్పింది.పూర్తి వివరాల తో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ తరుపున న్యాయవాది కి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. విచారణ ఈ నెల 24కి హైకోర్టు వాయిదావేసింది.

# కాంగ్రెస్ నేత చిన్నారెడ్డి,ఎమ్మెల్యే మెఘా రెడ్డి వివాదం ఢిల్లీకి

తెలంగాణ,ఆగస్టు 21, : కాంగ్రెస్ నేత చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మెఘా రెడ్డి వివాదం ఢిల్లీకి చేరింది. ఢిల్లీలో పర్యటి స్తున్న వనపర్తి ఎమ్మెల్యే మెఘా రెడ్డి, ఆయన అనుచర వర్గం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ను కలిసి ఫిర్యాదు చేశారు. చిన్నారెడ్డి కాంగ్రెస్ పార్టీకి వ్యతి రేకంగా మాట్లాడిన రికార్డులను, క్లిప్పింగ్ లను అందచేశారు. చిన్నారెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. పార్టీ సీనియర్ నేతలకు.చిన్నా రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలపై ఖర్గే కు మెఘా రెడ్డి ఫిర్యాదు చేశారు. ఇటీవల కాలంలో పార్టీ లైను దాటి వ్యతిరేకంగా మాట్లా డుతున్న వారి వ్యవహార శైలి కూడ ఖర్గే దృష్టికి తీసుకు వెళ్లినట్లు మెఘా రెడ్డి తెలిపారు. అలాగే కేసీ వేణుగోపాల్ తో పాటు పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ ను కూడా కలవనున్నారు. చిన్నా రెడ్డి బీఆర్ఎస్ తోకుమ్మక్కై కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేస్తున్నా రని మేఘారెడ్డి ఆరోపించారు

# తెలంగాణలో నేటి నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాల వారీగా నిర్వహిస్తున్న,సమీక్షలు

తెలంగాణ,ఆగస్టు 21,: తెలంగాణలో నేటి నుంచి రెవెన్యూ శాఖ మంత్రి పొంగు లేటి శ్రీనివాసరెడ్డి జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహించనున్నారు. నేటి నుంచి వరసగా రెవెన్యూ శాఖపై మంత్రి సమీక్షలు జరప నున్నారు.ఈ సమీక్ష సమావేశా లకు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు హాజరు కావాలని ఆదేశించారు.వివిధ అంశాలపై,అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్షలలో ప్రధా నంగా 22 ఎ పై చర్చిస్తారని తెలిసింది. దీంతో పాటు ప్రజల సమస్యలు, స్థానిక అవసరాలపై నేరుగా ఆరా తీయనున్నారు. అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇందిరమ్మ ఇళ్లు, హౌసింగ్ పథకాల అమలుపైనా సమీక్ష నిర్వహిస్తారు.

# రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన రద్దు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన రద్దయింది

తెలంగాణ,ఆగస్టు 21,: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన రద్దయింది. ఈ నెల 23వ తేదీన రేవంత్ రెడ్డి లండన్ నుంచి నేరుగా హైదరాబాద్ చేరుకోను న్నారు. కేంద్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు అను మతి నిరాకరించడంతో ఆయన తిరిగి లండన్ నుంచి హైదరాబా ద్ చేరుకోనున్నారు.కేంద్ర అను మతి ఇవ్వకపోవడంతో,ప్రస్తు తం లండన్ లో రేవంత్ రెడ్డి పర్యటన కొనసాగుతుంది. ఆక్స్ ఫర్డ్ విశ్వవిద్యాలయం, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ కార్యక్రమా ల్లోపాల్గొన్నారు. ముందుగా అక్బరుద్దీన్ ఇంట వివాహానికి హాజరయ్యారు. లండన్ నుంచి అమెరికా వెళ్లాల్సి ఉండగా, కేంద్ర అనుమతి రద్దు కావడంతో ఆయన తిరిగి హైదరాబాద్ కు బయలుదేరి రానున్నారు. అధికారులను అమెరికాకు పంపాలని రేవంత్ రెడ్డి నిర్ణ యించుకున్నారు.

# కొండాకు వ్యతిరేకంగా ఒక్కట యిన ఎమ్మెల్యేలు,మంత్రి కొండా సురేఖ ఎపిసోడ్‌పై కాంగ్రెస్ నాయకత్వం సీరియస్



తెలంగాణ, ఆగస్టు 21, : తెలంగాణ మంత్రి కొండా సురేఖ ఎపిసోడ్‌పై కాంగ్రెస్ నాయకత్వం సీరియస్ గా ఉంది. క్రమశిక్షణ కమిటీకి సురేఖ ఇచ్చిన వివర ణపై అసంతృప్తి వ్యక్తం చేసింది. తన కుమార్తె సుస్మిత వ్యాఖ్యల ను ఖండించకపోగా, తనకు, కుమార్తె సుస్మిత వ్యాఖ్యలకు సంబంధం లేదని చెప్పడాన్ని కొందరు తప్పుపడుతున్నారు. బర్త్ రఫ్ చేయాలని,కుమార్తె చేసిన వ్యాఖ్యలతో సంబంధం లేదన్న సురేఖ,సుస్మిత వ్యాఖ్యల పై విచారం వ్యక్తం చేయకపోవ డం సరికాదన్న నేతలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతు న్నారు. మరొకవైపు నేడు కొండా సురేఖ కుటుంబానికి వ్యతిరేకం గా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమా వేశ మయ్యారు. కొండా సుస్మిత రేవంత్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యల ను ఖండించడంతో పాటు ఆమెను మంత్రి వర్గం నుంచి బర్త్ రఫ్ చేయాలని కోరనున్నారు.

# తిరుపతిలో వైభవంగా 'అమరావతి ఛాంపియన్‌షిప్ - 2026' ఏర్పాట్లు

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్



తిరుపతి, మహి న్యూస్, ఆగస్టు 21 : జాతీయ క్రీడా దినోత్సవం (ఆగస్టు 29) సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అమరావతి ఛాంపియన్‌షిప్ -- 2026" రాష్ట్ర స్థాయి పోటీలకు తిరుపతి నగరం సర్వసన్నద్ధమవుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు . వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ గోవిందరావు పాల్గొన్నారు. ఈ పోటీల నిర్వహణపై సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులతో కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించి, పలు మార్గదర్శకాలను జారీ చేశారు.

**ప్రధాన వివరాలు:**

పోటీల తేదీలు & వేదికలు: ఈ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ఆగస్టు 24 నుండి 27 వరకు తిరుపతిలోని వివిధ మైదానాల్లో జరుగుతాయి.

భారీ భాగస్వామ్యం: రాష్ట్రవ్యాప్తంగా అండర్-17, అండర్-21 విభాగాల్లో (బాలురు, బాలికలు) సుమారు 12,000 మంది క్రీడాకారులు, కోచ్‌లు మరియు మేనేజర్లు పాల్గొననున్నారు.

క్రీడాంశాలు: ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, చెస్, హాకీ, కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్ మరియు యోగాతో సహా మొత్తం 12 రకాల క్రీడల్లో పోటీలు నిర్వహిస్తారు.

నగదు బహుమతులు: విజేతలుగా నిలిచే 956 మంది క్రీడాకారులకు (478 మంది విజేతలు, 478 మంది రన్నరప్‌లు) మొత్తం రూ. 91.90 లక్షల నగదు బహుమతులు అందజేయనున్నారు. ముగింపు వేడుకలు ఆగస్టు 29న విజయవాడలో జరుగుతాయి.

**శాఖల వారీగా ఆదేశాలు:**

వసతి - రవాణా: క్రీడాకారుల కోసం శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ, పద్మావతి మహిళా వర్సిటీలతో పాటు ప్రధాన పాఠశాలల్లో వసతి ఏర్పాట్లు చేశాం. ఆటగాళ్ల రవాణా కోసం 35 ప్రత్యేక బస్సులను కేటాయించడం జరిగింది.

రక్షణ - భద్రత: క్రీడా వేదికలు మరియు వసతి గృహాల వద్ద పోలీసు శాఖ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. బాలికల వసతి వద్ద ప్రత్యేకంగా మహిళా కానిస్టేబుళ్లను నియమిస్తున్నాం.

పారిశుధ్యం - తాగునీరు: నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో అన్ని వేదికల వద్ద తాగునీరు, 50 మొబైల్ టాయిలెట్లు మరియు నిరంతర పారిశుధ్య సేవలు అందిస్తారు.

వైద్యం - విద్యుత్: ప్రతి క్రీడా ప్రాంగణంలో వైద్య బృందాలు, అంబులెన్సులు సిద్ధంగా ఉంటాయి. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో అంతరాయం లేని విద్యుత్ సరఫరా మరియు తారకరామ స్టేడియంలో అగ్నిమాపక యంత్రాన్ని అందుబాటులో ఉంచుతున్నాం. రాష్ట్ర నలుమూలల నుండి వచ్చే క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్డీఓ, మున్సిపల్ అధికారులు మెడికల్ అధికారులు, స్పోర్ట్స్ సిబ్బంది జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు తొలగిపోకూడదు

### ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు ఎం.ఎం.నాయక్

శ్రీకాకుళం, మహి న్యూస్, ఆగస్టు 21: అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా అత్యంత పారదర్శకంగా, సమగ్రంగా జాగ్రత్తలు తీసుకుంటూ తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని శ్రీకాకుళం జిల్లా ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖల ప్రత్యేక కార్యదర్శి ఎం.ఎం.నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం శ్రీకాకుళంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో కలిసి నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్, మార్గదర్శకాల ప్రకారం సవరించిన ముసాయిదా జాబితా ఆధారంగా, గత జాబితాతో అనుసంధానం కానటువంటి లేదా పొరపాట్లు ఉన్న వ్యక్తులకు తక్షణమే ఈఆర్‌వో ద్వారా నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. ఆబ్సెంట్, షిఫ్టెడ్, డూప్లికేట్, డెత్ (ఏఎస్‌డీడీ) వర్గాల ఓటర్లను తొలగించే క్రమంలో అత్యంత నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనే పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని, ఎటువంటి సందేహాలు లేదా అపోహలకు ఆస్కారం ఇవ్వకూడదని ఎం.ఎం.నాయక్ పిలుపునిచ్చారు. అనంతరం పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమైన ఆయన, వారు లేవనెత్తిన పలు అంశాలను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీనిపై పలు పార్టీల ప్రతినిధులు తమ పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా నమోదు ప్రక్రియ, మార్పులు, చేర్పుల వివరాల నిమిత్తం సమాచారాన్ని పరిశీలించడానికి భారత ఎన్నికల సంఘం అధికారిక పోర్టల్ అందుబాటులో ఉందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఇప్పటివరకు 97.27 శాతం నోటీసులను విజయవంతంగా అందజేశామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. జిల్లాలోని మొత్తం 1,16,258 నోటీసులకు గాను 1,13,088 నోటీసులు పంపిణీ చేశామని, మరో 3,170 నోటీసులు అందజేయాల్సి ఉందని వివరించారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే నరసన్నపేటలో అత్యధికంగా 99.83 శాతం (4,157 నోటీసులు), ఇచ్ఛాపురంలో 98.23 శాతం (40,001 నోటీసులు), టెక్కలిలో 97.47 శాతం (19,143 నోటీసులు) పంపిణీ పూర్తయినట్లు పేర్కొన్నారు. అలాగే పలాసలో 96.47 శాతం, పాతపట్నంలో 96.23 శాతం, ఎచ్చెర్లలో 96.47 శాతం, ఆముదాలవలసలో 95.66 శాతం, శ్రీకాకుళంలో 95.36 శాతం చొప్పున నోటీసుల అందజేత పూర్తయిందని తెలిపారు. అంతకుముందు సర్ 2026 ప్రక్రియకు సంబంధించి కమాండ్ కంట్రోల్ రూమ్ ను నాయక్ పరిశీలించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండియా, జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావు, జిల్లా ముఖ్యకార్య నిర్వహణ అధికారి వెంకట్రామన్, ఆర్డీవోలు కృష్ణమూర్తి, సాయి ప్రత్యూష, అప్పలరాజు, తహసిల్దారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పీ.ఎమ్.జె. బాబు (టీడీపీ), రౌతు శంకరరావు (వైఎస్ఆర్సీపీ), పీ. సురేష్ సింగ్ (బీజేపీ), ఐటీ.కుమార్ (వైఎస్ఆర్సీపీ), ఎస్. సత్యనారాయణ (వైఎస్ఆర్సీపీ), కే.వీ.ఎల్.ఎస్. ఈశ్వరి (కాంగ్రెస్), ఎల్. సోమేశ్వరరావు (బీఎస్పీ), బి. అర్జున్ కుమార్ (జనసేన) తదితరులు హాజరయ్యారు.

# ఇంద్రకీలాద్రిపై రూ. 52.50 కోట్లతో నిర్మించిన 'శ్రీ కనకదుర్గ అన్నప్రసాద సదనం', 'శ్రీ దుర్గా భవాని మహాప్రసాద భవనం'లను ప్రారంభించిన దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

ఇంద్రకీలాద్రి, మహి న్యూస్, ఆగస్టు 21 : విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం రూ. 52.50 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన "శ్రీ కనకదుర్గ అన్నప్రసాద సదనం" మరియు "శ్రీ దుర్గా భవాని మహాప్రసాద భవనం" లను రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. అంతకుముందు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి, అనంతరం ప్రజాప్రతినిధులు మరియు ఉన్నతాధికారులతో కలిసి నూతన భవనాలను భక్తులకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఆలయ భవిష్యత్ అభివృద్ధి, రాబోయే ఉత్సవాల ఏర్పాట్లపై కీలక అంశాలను వెల్లడించారు. రెండవ ఘాట్ రోడ్డు ఏర్పాటుకి చర్యలు : ఇంద్రకీలాద్రిపై ట్రాఫిక్ సమస్యలను శాశ్వతంగా నివారించేందుకు, అత్యవసర సమయాల్లో రాకపోకలు సజావుగా సాగేలా రెండవ ఘాట్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించి, త్వరితగతిన నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కుమ్మరి పాలెం నుంచి 700 మీటర్ల మేర ఈ ఘాట్ రోడ్డు నిర్మించేందుకు ఇప్పటికే ఆర్ అండ్ బి, ఓ కన్సల్టెన్సీ సంస్థకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. టీటీడీ స్థలంలో మల్టీ లెవెల్ బిల్డింగ్ నిర్మాణం : ? కుమ్మరిపాలెంలో ఉన్న 3 ఎకరాల టీటీడీ స్థలాన్ని తీసుకుని దుర్గమ్మ భక్తుల కోసం వినియోగిస్తామని మంత్రి అన్నారు. ఆ స్థలంలో ఏడు అంతస్తుల బిల్డింగ్ నిర్మించి.. అక్కడ మల్టీ లెవెల్ పార్కింగ్, భక్తుల కోసం గదులను నిర్మించి సుమారు 15 వేల మందికి ఉపయోగపడేలా బిల్డింగ్ త్వరలో నిర్మిస్తామన్నారు.

కేశఖండనశాల, ఆదిశంకరాచార్యుల విగ్రహం ఏర్పాటు : దుర్గఘాట్ దగ్గర నూతన కేశఖండనశాల నిర్మించేందుకు ప్రతిపాదనలు ఉన్నాయని.. ఇప్పటికే సమీపంలో ఉన్న కార్పొరేషన్ స్థలాన్ని కూడా తీసుకుని భారీ కేశఖండనశాల నిర్మిస్తామన్నారు. ఇక.. ప్రస్తుతం ఉన్న ఘాట్ రోడ్డు మొదటి మలుపులో 25 అడుగుల ఆదిశంకరాచార్యులు విగ్రహం నిర్మించేందుకు ప్రణాళికలు ఉన్నాయన్నారు.

రాబోయే దసరా ఉత్సవాల ప్రత్యేక ఏర్పాట్లు: త్వరలో రానున్న ప్రతిష్టాత్మక 'దేవి శరన్నవరాత్రి దసరా మహోత్సవాలు'కు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం, పోలీస్, మున్సిపల్ మరియు రెవెన్యూ విభాగాల సమన్వయంతో పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

క్యూ లైన్లలో నిరంతర తాగునీరు, పాలు, ప్రసాదాల వితరణ, పారిశుద్ధ్యం మరియు భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తామని స్పష్టం చేశారు.

భక్తులకు అన్నప్రసాదం వడ్డన -- లడ్డూ ప్రసాదాల కొనుగోలు:

నూతన శ్రీ కనకదుర్గ అన్నప్రసాద సదనంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తదితరులు భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. అనంతరం మహాప్రసాద భవనంలో పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని, వేద పండితుల ఆశీస్సులు పొందారు. ప్రసాద భవనంలో ఏర్పాటు చేసిన ప్రసాదం విక్రయ కౌంటర్ వద్ద నగదు చెల్లించి శ్రీ అమ్మవారి లడ్డూ ప్రసాదాలను మంత్రి ఆనం కొనుగోలు చేశారు.

**ప్రారంభించిన నూతన భవనాల వివరాలు :**

శ్రీ కనకదుర్గ అన్నప్రసాద సదనం (రూ. 26.00 కోట్లు): మొత్తం 5,400 చదరపు మీటర్ల విస్తీర్ణంలో (సుమారు 58,125 చ.అ) నిర్మితమైన ఈ భవనంలోని మొదటి అంతస్తు భోజన శాలలో ఒకే విడతలో 800 మంది భక్తులు కూర్చుని భోజనం చేసే వసతి ఉంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో సెంట్రల్ స్టోర్, వంట ప్రిపరేషన్ ఏరియా, వాష్‌రూమ్‌లు మరియు మూడు వైపుల నుండి వాహనాల రాకపోకలకు వీలుగా మార్గాలు సిద్ధం చేశారు.

శ్రీ దుర్గా భవాని మహాప్రసాద భవనం (రూ. 26.50 కోట్లు): మొత్తం 3,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో (సుమారు 38,748 చ.అ) 4 అంతస్తులుగా నిర్మించారు. గ్రౌండ్, మొదటి అంతస్తుల్లో ప్రసాదం విక్రయ కౌంటర్లు, క్యూ లైన్లు ఉండగా.. రెండు, మూడవ అంతస్తులలో పులిహోర, చక్కెరపొంగలి, లడ్డూల తయారీ, ప్యాకింగ్, స్టాకింగ్ (నిల్వ) అత్యాధునిక వసతులు సమకూర్చారు.

**త్వరలో 'యాంత్రీకృత వంటశాలలు':**

భవిష్యత్ రద్దీని దృష్టిలో ఉంచుకుని అత్యున్నత పరిశుభ్రత (హైజీన్) ప్రమాణాలతో వేగంగా వంటలు తయారు చేసేందుకు ఈ రెండు భవనాల్లో త్వరలోనే యాంత్రీకృత వంటశాలలను ప్రవేశపెడతామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ లోక్‌సభ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్ ప్రసాద్, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్, ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# నూతన ప్రభుత్వ కార్యాలయ భవనాలతో ప్రజలకు మెరుగైన సేవలు....

### రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



జగిత్యాల జిల్లా, ఆగస్టు 21, : శుక్రవారం జిల్లాలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణంతో ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ధరూర్ క్యాంప్‌లో నూతనంగా మంజూరైన పలు ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగుల మరియు ట్రాన్స్‌జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, సి.సి.ఎల్. ఏ. కమిషనర్ లోకేష్ కుమార్, స్పెషల్ సెక్రటరీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎం .డి. హౌసింగ్ గౌతం, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. జగిత్యాల రెవెన్యూ డివిజనల్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల అంచనా వ్యయంతో , మెట్‌పల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల నిధులు, భీమారం తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల అంచనా వ్యయంతో,ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల నిధులు, మాల్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1.40 కోట్ల అంచనా వ్యయంతో, మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1.40 కోట్ల నిధులు మొత్తంగా ఆరు ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణానికి రూ.11.80 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా జగిత్యాల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, భీమారం, ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయాలు, మల్యాల, మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక సౌకర్యాలతో నూతన కార్యాలయ భవనాలను నిర్మించడం ద్వారా ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, సౌకర్యవంతంగా అందించేందుకు వీలవుతుందని మంత్రి పేర్కొన్నారు.ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, అధికారులు మరియు సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు అనువైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. నూతన భవనాల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.రెవెన్యూ, రిజిస్ట్రేషన్ తదితర శాఖల సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు. కార్యాలయాల నిర్మాణంలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో పరిపాలనా సౌకర్యాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమాల్లో శాసన మండలి సభ్యులు ఎల్ .రమణ, చొప్పదండి శాసనసభ్యులు మేడిపెల్లి సత్యం , వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావు, అదనపు కలెక్టర్ లు బి. ఎస్ లత, బి. రాజ గౌడ్, జగిత్యాల జిల్లా గ్రంథాలయం చైర్మన్ సంఘనభట్ల దినేష్, జగిత్యాల, మెట్ పెల్లి, కోరుట్ల ఆర్డీవోలు మధుసూదన్, నరసింహ రావు, జీవాకర్ రెడ్డి, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ నాగజ్యోతి, మెట్ పెల్లి మున్సిపల్ చైర్మన్, కోరుట్ల మున్సిపల్ చైర్మన్, రాయికల్ మున్సిపల్ చైర్మన్, ఆయా మండలాల స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED 9147/1, SRI LAKSHMI NARASIMHA YOGIMAILAVARAM ARCH ROAD, YOGIMAILAVARAM,TIRUPATHI,AP - 517503.A.P .VSAR PUBLICATIONSDOOR NO. 403, PANTA STREET, TIRUPATHI - 517501.RNI NO : APTEL/26/A5325. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

## ఏబీవీపీ నంద్యాల నూతన కార్యవర్గం ఎన్నిక

### నంద్యాల బాగ్ కన్వీనర్‌గా మనీష్.. నగర కార్యదర్శిగా నరేష్



నంద్యాల మహి న్యూస్ । ఆగస్టు 21: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నంద్యాల నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. నంద్యాల జిల్లా ప్రముఖ్ పార్థసారథి నూతన బాధ్యతలను ప్రకటించారు. నంద్యాల బాగ్ కన్వీనర్‌గా మనీష్, నగర కార్యదర్శిగా నరేష్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1949 జూలై 9న ఆవిర్భవించిన ఏబీవీపీ విద్యార్థుల పక్షాన నిలుస్తూ విద్యారంగ సమస్యలపై నిరంతరం ప్రశ్నిస్తోందన్నారు. విద్యార్థుల సమస్యలు ఎదురైన ప్రతిసారీ తక్షణమే స్పందిస్తూ, అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో బానిసత్వ భావనను తొలగించి దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఏబీవీపీ పనిచేస్తోందన్నారు. జాతీయ పునర్నిర్మాణాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని 'జ్ఞానం--శీలం--ఏకత'ను సాధనాలుగా మలుచుకుని జాతీయతను ప్రోత్సహిస్తున్న ఏకైక విద్యార్థి సంస్థ ఏబీవీపీ అని పేర్కొన్నారు. లాఠీలు, తూటాలు, ప్రాణాలకు సైతం భయపడకుండా లక్షలాది మంది విద్యార్థులను జాతీయ భావాల వైపు నడిపిస్తున్న సంస్థగా ఏబీవీపీ నిలిచిందన్నారు. కేవలం నలుగురితో ప్రారంభమైన ఏబీవీపీ నేడు మారుమూల గ్రామాల నుంచి మహానగరాల వరకు, అటక్ నుంచి కటక్ వరకు, కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు విస్తరించిందన్నారు. ప్రస్తుతం 77 లక్షల సభ్యత్వంతో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా ఏబీవీపీ నిలిచిందని వారు తెలిపారు.

## గోరంట్లలో నూతన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ శాఖ ప్రారంభం

### 5,000కు పైగా జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు బ్యాంకింగ్ సేవలు చేరువ చేయడమే లక్ష్యం





కర్నూలు, ఆగస్టు 21: (మహి న్యూస్): కోడుమూరు మండలం గోరంట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ శాఖను జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ శుక్రవారం ప్రారంభించారు. గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ శాఖను ఏర్పాటు చేశారు.



డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ మార్గదర్శకాల మేరకు 5,000కు పైగా జనాభా కలిగిన గ్రామ పంచాయతీలలో బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ గోరంట్లలో నూతన శాఖను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ, 5,000కు పైగా జనాభా ఉన్న గ్రామ పంచాయతీలలో బ్యాంకు శాఖలను ఏర్పాటు చేయాలనే కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నాయని తెలిపారు. గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయడంలో భాగంగా గోరంట్లలో నూతన శాఖను ఏర్పాటు చేసినందుకు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌ను అభినందించారు. గ్రామ ప్రజలు ఈ బ్యాంకింగ్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పి. మోహన్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి రావడం ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. ముఖ్యంగా రైతులు, చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న వారు బ్యాంకు రుణాలతో పాటు ఇతర ఆర్థిక సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ సంజయ్ కుమార్ ఝా మాట్లాడుతూ, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఒకటని తెలిపారు. కర్నూలు జిల్లాలో ఇప్పటికే ఐదు శాఖలు ఉండగా, గోరంట్లలో నూతన శాఖ ఏర్పాటుతో జిల్లాలో మొత్తం ఆరు శాఖలు అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలకు అనుగుణంగా పంట రుణాలు, బంగారు రుణాలు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాలు తదితర బ్యాంకింగ్ సేవలను విస్తృతంగా అందించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. నూతన శాఖ ఏర్పాటుతో గోరంట్లతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభంగా, వేగంగా అందుబాటులోకి రానున్నాయి. బ్యాంకింగ్ సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో రైతులు, చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధిదారులకు ఈ శాఖ మరింత ఉపయోగకరంగా మారనుంది. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ తిరుపతి రీజినల్ మేనేజర్ సంజయ్ కుమార్ ఝా, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పి. మోహన్, గ్రామ సర్పంచు బాలకృష్ణ, బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్, బ్యాంకు అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గోరంట్ల గ్రామస్తులు పాల్గొన్నారు.

## రెండేళ్ల మంచి ప్రభుత్వం - నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం

### కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న పాణ్యం నియోజకవర్గ యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి



కర్నూలు, ఆగస్టు 21: (మహి న్యూస్): కల్లూరు అర్బన్ 21వ వార్డు పరిధిలోని మాధవి నగర్, కృష్ణమూర్తి స్టోర్, సెయింట్ లూడ్స్ స్కూల్ ప్రాంతాల్లో "రెండేళ్ల మంచి ప్రభుత్వం -- నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాణ్యం నియోజకవర్గ యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి ఆయా కాలనీల్లో పర్యటించి, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్న పథకాల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని గౌరు జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు రాఘవేంద్ర రెడ్డి, దివాకర్ రెడ్డి, లక్ష్మణ స్వామి, వెంకటేష్ చౌదరి, సుదర్శన్ రెడ్డి, భరత్ నాయక్, సుధాకర్, గంగాధర్ గౌడ్ తదితరులతో పాటు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెండెకంటి స్కూల్లో విద్యార్థిపై దాడి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### మూడో తరగతి విద్యార్థి యతేష్‌పై దాడి చేసిన టీచర్, పీఈటీ మాస్టర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

### పాఠశాల గుర్తింపును రద్దు చేసి సీజ్ చేయాలి.. యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

### చర్యలు తీసుకోకపోతే ప్రజాసంఘాలతో కలిసి ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధం: సీపీఐ బనగానపల్లె మండల కార్యదర్శి శివయ్య









బనగానపల్లె, ఆగస్టు 21: (మహి న్యూస్): బనగానపల్లె నియోజకవర్గ కేంద్రంలోని పెండెకంటి హైస్కూల్లో మూడో తరగతి విద్యార్థి యతేష్‌పై టీచర్, పీఈటీ మాస్టర్ దాడి చేసి గాయపరిచారనే ఆరోపణలపై సీపీఐ బనగానపల్లె మండల సమితి తీవ్రంగా స్పందించింది. ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ బనగానపల్లె మండల కార్యదర్శి శివయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులే వారిపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడటం ఆందోళనకరమన్నారు. మూడో తరగతి విద్యార్థి యతేష్‌పై దాడి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న టీచర్, పీఈటీ మాస్టర్‌పై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు రక్షణ కల్పించాల్సిన పాఠశాల యాజమాన్యం ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించలేదని ఆయన ఆరోపించారు. పాఠశాలలో విద్యార్థుల భద్రత, మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల అర్హతలు, ఫీజుల వసూళ్లు తదితర అంశాలపై విద్యాశాఖ అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలోనే షూ, టై, బెల్ట్, పుస్తకాలు, స్టేషనరీ విక్రయిస్తున్నారని, అధిక ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నారని శివయ్య ఆరోపించారు. ఈ అంశాలపై కూడా విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. బనగానపల్లె పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల వసూళ్లు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల భద్రత, యూనిఫామ్‌లు, పుస్తకాలు, స్టేషనరీ విక్రయాలు తదితర అంశాలపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థులపై దాడులకు పాల్పడే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని శివయ్య కోరారు. పెండెకంటి స్కూల్లో జరిగిన ఘటనపై అధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులుగా తేలిన టీచర్, పీఈటీ మాస్టర్‌తో పాటు పాఠశాల యాజమాన్యంపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పాఠశాల నిబంధనలను ఉల్లంఘించినట్లు విచారణలో తేలితే పాఠశాల గుర్తింపును రద్దు చేసి సీజ్ చేయాలని ఆయన కోరారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే సీపీఐ అనుబంధ ప్రజాసంఘాలతో కలిసి పెండెకంటి స్కూల్ ఎదుట ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీపీఐ బనగానపల్లె మండల కార్యదర్శి శివయ్య హెచ్చరించారు.

## స్థానిక ఎన్నికలకు మోగనున్న నగారా!

### సెప్టెంబరు నుంచి అక్టోబరు వరకు దశలవారీగా ఎన్నికలు?

### మున్సిపాలిటీలు.. జడ్పీటీసీ, ఎంపీటీసీ.. పంచాయతీలకు వరుస షెడ్యూల్



అమరావతి,మహి న్యూస్, ఆగస్టు 21: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేస్తోంది. మున్సిపాలిటీలు, జడ్పీటీసీ--ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీలకు దశలవారీగా ఎన్నికలు నిర్వహించేలా ఒక షెడ్యూల్ ప్రచారంలోకి వచ్చింది. ప్రచారంలో ఉన్న షెడ్యూల్ ప్రకారం సెప్టెంబరు 7న మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్, సెప్టెంబరు 20న పోలింగ్, సెప్టెంబరు 23న ఫలితాలు వెల్లడించేలా పేర్కొన్నారు. అనంతరం సెప్టెంబరు 28న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్, అక్టోబరు 11న పోలింగ్, అక్టోబరు 14న ఫలితాలు ప్రకటించేలా ఉంది. అదేవిధంగా అక్టోబరు 19న గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్, అక్టోబరు 28న పోలింగ్, అదే రోజు ఫలితాల ప్రక్రియ పూర్తిచేసేలా షెడ్యూల్‌లో పేర్కొన్నారు. నవంబరు 1 నుంచి కొత్తగా ఎన్నికైన స్థానిక సంస్థలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ఏర్పాట్లు చేయనున్నట్లు అందులో ఉంది.

### ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి



స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాల తయారీ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, రిజర్వేషన్ల ఖరారు తదితర ప్రక్రియలపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి సెప్టెంబరు 3లోగా ప్రచురించేలా రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే చర్యలు చేపట్టింది. బీసీ రిజర్వేషన్ల ఖరారు, ఓటర్ల జాబితాల ప్రక్రియ పూర్తయిన అనంతరం స్థానిక ఎన్నికల నిర్వహణకు మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. సెప్టెంబరు--అక్టోబరు నెలల్లో స్థానిక ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి.

గమనిక: పై తేదీలు ప్రస్తుతం ప్రచారంలో ఉన్న షెడ్యూల్ ఆధారంగా మాత్రమే ఇవ్వబడ్డాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా తుది నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాతే ఎన్నికల తేదీలను ఖరారైనవిగా పరిగణించాలి.

## ముద్ర లోన్స్ పేరుతో సైబర్ మోసాలు ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలి

### లోన్ మంజూరు చేస్తామని నమ్మించి డబ్బులు కాజేస్తున్న సైబర్ నేరగాళ్లు - కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్



కర్నూలు, ఆగస్టు 21:( మహి న్యూస్): ముద్ర లోన్ మంజూరైందని, తక్కువ వడ్డీకే రుణం ఇప్పిస్తామని నమ్మించి సైబర్ నేరగాళ్లు ప్రజలను, రైతులను మోసం చేస్తున్నారని కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా ప్రజలకు సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు. సైబర్ నేరగాళ్లు ఫోన్ కాల్స్, వాట్సాప్ సందేశాలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలను సంప్రదించి, లోన్ ప్రాసెసింగ్ ఫీజు, ఇన్సూరెన్స్, జీఎస్టీ, సెక్యూరిటీ డిపాజిట్ తదితర పేర్లతో ముందుగా డబ్బులు చెల్లించాలని కోరుతున్నారని ఎస్పీ తెలిపారు. లోన్ వస్తుందనే ఆశతో వారి మాటలను నమ్మి డబ్బులు పంపిన అనంతరం మరిన్ని డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేయడం, ఆ తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడం వంటి మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

**ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

**గుర్తుతెలియని వ్యక్తులు ఇచ్చే రుణ ఆఫర్లను నమ్మవద్దు.**

**రుణం కోసం ముందుగా వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు డబ్బులు పంపవద్దు.**

**ఓటీపీ, ఏటీఎం పిన్, సీవీవీ, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దు.**

**అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దు.**

**అధికారిక బ్యాంకులు, ప్రభుత్వ సంస్థల ద్వారా మాత్రమే రుణ వివరాలను నిర్ధారించుకోవాలి.**

**అనుమానం వచ్చిన వెంటనే సంబంధిత అధికారులు లేదా బ్యాంకు సిబ్బందిని సంప్రదించాలి.**

**మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి**

సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. అలాగే లిలిలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సమీప పోలీస్ స్టేషన్‌తో పాటు జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులను కూడా సంప్రదించాలని సూచించారు. మోసానికి గురైన తర్వాత స్పందించడం కంటే ముందుగానే అప్రమత్తంగా ఉండటం ఎంతో ముఖ్యమని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ అన్నారు. ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని, అపరిచితుల రుణ ఆఫర్ల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయం, కర్నూలు.

## యువ ఓటర్లే ప్రజాస్వామ్యానికి బలం

### 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువకుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి



అమలాపురం, మహిన్యూస్, ఆగష్టు 21: ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత భాగస్వామ్యం అత్యంత కీలకమని అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువకుడు ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. "నా ఓటు -- నా బాధ్యత" అనే స్ఫూర్తితో యువత ఎన్నికల ప్రక్రియలో చురుకుగా భాగస్వాములు కావాలని కలెక్టర్ సూచించారు. ఓటు హక్కు కేవలం హక్కు మాత్రమే కాదని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే బాధ్యత కూడా అని తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని, పేరు లేకుంటే నిబంధనల ప్రకారం ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు వివరాల్లో మార్పులు, చేర్పులు అవసరమైతే సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి సకాలంలో సవరణలు చేసుకోవాలని తెలిపారు. యువతలో ఓటు హక్కుపై అవగాహన పెంచడంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లోని అర్హులైన వారిని కూడా ఓటరుగా నమోదు చేసుకునేలా చైతన్యపరచాలని కలెక్టర్ కోరారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. దేశ భవిష్యత్తును నిర్ణయించడంలో యువ ఓటర్ల పాత్ర ఎంతో కీలకమని, బాధ్యతాయుతమైన ఓటింగ్ ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి యువ ఓటరు తన ఓటు విలువను గుర్తించి ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

## అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి - గొల్లపల్లి అమూల్య



రాజోలు, ఆగస్టు 21 (మహి న్యూస్): కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రాజోలు టీడీపీ ఇన్‌చార్జ్, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి గొల్లపల్లి అమూల్య పిలుపునిచ్చారు. శివకోటి గ్రామంలోని టీడీపీ కార్యాలయం వద్ద 43వ వారం "కేడర్ విత్ లీడర్" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ నాయకత్వంలో పోలవరం, అమరావతి, విద్య, ఉపాధి తదితర రంగాల్లో అభివృద్ధి కొనసాగుతోందన్నారు. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అనంతరం కూటమి నేతల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మామిడికుదురు మండలం గెద్దాడ గ్రామానికి చెందిన అనారోగ్య బాధితుడు గెద్దాడ వీర వెంకట సత్యనారాయణకు సీఎం సహాయ నిధి నుంచి రూ.5.50 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. "రెండేళ్ల నమ్మకం--అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారాన్ని వేగవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. మలికిపురం మండలంలోని క్లస్టర్--6లో ఇంటింటి ప్రచారం 100 శాతం పూర్తిచేసిన క్లస్టర్ ఇన్‌చార్జ్ మంగిన భూదేవిని అభినందించారు.



అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరుతూ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ప్రజల నుంచి వివిధ సమస్యలపై నాలుగు, సీఎం సహాయ నిధికి సంబంధించి ఆరు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామశాఖ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనసేనలో స్థానిక సంస్థల ఎన్నికల కమిటీ ఏర్పాటు



జనసేన JANASENA

21.08.2026

స్థానిక సంస్థల ఎన్నికల విధి విధానాల రూపకల్పనకు కమిటీ నియామకం

- 14 మంది సభ్యులు

D.No. 11-1903, Sri Lakshmi Narasimha Colony, Mangalagiri, Andhra Pradesh, Pincode: 522503, India, Contact: +91 86452 93140

రాజోలు, మహి న్యూస్, ఆగస్టు 21: స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ అనుసరించాల్సిన విధివిధానాల రూపకల్పనకు 14 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ కమిటీని నియమించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడంతోపాటు క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన కార్యాచరణను కమిటీ రూపొందించనుంది. ఎన్నికల వ్యూహం, పార్టీ నిర్మాణం, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై కమిటీ చర్చించి పార్టీ నాయకత్వానికి సూచనలు చేయనుంది. కమిటీ సభ్యులుగా మండలి బుద్ధ ప్రసాద్, టీ. శివశంకర్, కందుల దుర్గేష్, వల్లభనేని బాలశౌరి, బొలిశెట్టి శ్రీనివాస్, దేవ వరప్రసాద్, సుజయ్ మంగళవరం యాదవ్, లోకం మాధవి, పంతమట్టల ధర్మరాజు, చిలకం మధుసూదన్ రెడ్డి, కొటికలపూడి గోవిందరావు (చినబాబు), సామినేని ఉదయభాను, యనమల భాస్కర్, కొరికాన రవి కుమార్‌లను నియమించారు.

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com
# మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com



## తొండూరు మోడల్ స్కూల్‌లో మహిళా భద్రతపై అవగాహన

### విద్యార్థినులకు మహిళా భద్రత, సాధికారత, సోషల్ మీడియా వినియోగంపై అవగాహన కల్పించిన ఎస్ఐ శివ నాగిరెడ్డి



పులివెందుల /తొండూరు మహి న్యూస్ ఆగష్టు 21: తొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థినులకు మహిళా భద్రత, సాధికారత, సోషల్ మీడియా వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొండూరు ఎస్ఐ శివ నాగిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు పలు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివ నాగిరెడ్డి మాట్లాడుతూ మహిళలు, బాలికలు తమ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, బ్యాంకు సంబంధిత సమాచారాన్ని అపరిచితులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసాలు, సోషల్ మీడియా ద్వారా ఎదురయ్యే సమస్యల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, మెసేజ్‌లను క్లిక్ చేయకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురిచేసినా, ఇబ్బందులకు గురిచేసినా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌కు, బాలల సహాయం కోసం 1098 హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవాలని విద్యార్థినులకు వివరించారు. మహిళలు, బాలికల భద్రతకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఎలాంటి సమస్య ఎదురైనా ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఎర్రగుంట్లలో ఇంటింటికీ తెలుగుదేశం

### కూటమి ప్రభుత్వం రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన



కడప జిల్లా/ జమ్మలమడుగు మహి న్యూస్ । ఆగష్టు 21: ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధిలోని 1, 2 వార్డుల్లో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమాన్ని నిర్వహించారు. కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించడంతో పాటు, స్థానిక సమస్యలను కూడా తెలుసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుంట్ల మార్కెట్ యార్డు చైర్మన్ నాగరాజు, ఎర్రగుంట్ల పట్టణ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం రాయలసీమ భాగస్వామ్యం 'పుస్తకావిష్కరణ

### ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి




కడప మహి న్యూస్ ఆగస్టు 21 : వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం ప్రచురించిన 'వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం- రాయలసీమ భాగస్వామ్యం' అనే గ్రంథాన్ని 2026 ఆగస్టు 23వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆవిష్కరిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి తెలిపారు. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఈ గ్రంథం రాయలసీమ సాహిత్య చరిత్రలో చిరస్మరణీయమైన స్థానాన్ని ఆక్రమిస్తుందని, రాయలసీమ సాహిత్యంలో ప్రక్రియా పరంగా వచ్చిన తొలి పుస్తకం కూడా ఇదే అవుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ వైయస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బి. జయరామిరెడ్డి, విశిష్ట అతిథిగా హైదరాబాద్ ప్రముఖ క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ వెన్నపూస మారుతీశంకర్ రెడ్డి రానుండగా, పుస్తక సమీక్షకులుగా ప్రసిద్ధ తెలుగు సాహిత్య విమర్శకులు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, గౌరవ అతిథులుగా ప్రఖ్యాత సాహితీవేత్త,విశ్రాంత ఉపన్యాసకులు డాక్టర్ ఏల్చూరి మురళీధరరావు (హైదరాబాద్), రాయలసీమ ప్రజా రచయిత డాక్టర్ శాంతి నారాయణ (అనంతపురం), ఆత్మీయ అతిథులుగా హాజరవుతున్నారు. కథ,నవల,నాటక రచయిత డాక్టర్ వి.ఆర్. రాసాని(తిరుపతి), కథా రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ (కర్నూల్) విచ్చేయుచున్నారన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణం నిర్వహణలో జరిగే ఈ కార్యక్రమంలో ఇటీవల ఇంగ్లాండులో ప్రతిష్టాత్మకమైన గోబల్ హెల్త్ అవార్డు – 2026 అందుకున్న కడప జిల్లా బిడ్డ డాక్టర్ వి. యం. శంకర్ రెడ్డిని ఘనంగా సత్కరించనున్నామని అలానే చిలుమూరు రవితేజ కుమార్ రెడ్డి (సాహిత్యం), తలిశెట్టి శ్రీవాణి అర్జున్( సంగీతం), ఆకెపోగు జయ చంద్రారావు (చిత్రలేఖనం ),కస్తూరి అప్పలనాయుడు( శిల్పం), చల్లా హిమహారతి (నాట్యం ),చాట్ల గంగరాజు (నాటకం), వై. మనోహరావు ((గ్రాఫిక్స్)లకు ఆత్మీయ యువ సత్కారాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి సాహితీ ప్రేమికులు, అభిమానులు, అందరూ ఆహ్వానితులేనన్నారు.

## శ్రావణ శుక్రవారం గాలివీడు లో ని ఆలయాలల్లో ప్రత్యేక పూజలు

### భక్తిశ్రద్ధలతో అమ్మవారికి కుంకుమార్చనలు.



గాలివీడు:ఆగష్టు21(మహి న్యూస్ ): శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా స్థానిక రామాలయంలో మహిళా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం నుంచే భక్తుల సందడి నెలకొంది. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చనలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణ శుక్రవారం విశిష్టతను పురస్కరించుకుని మహిళలు సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, పూలతో ప్రత్యేక అలంకరణ చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం వేద పండితుల ఫణి కుమార్ శర్మ మంగళహారతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పూజా కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

# సింగపూర్ టౌన్‌షిప్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవం

### 15 మంది కార్యవర్గ సభ్యుల ఎన్నిక.. అధ్యక్షుడిగా డా. టి.ఎస్. రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జి. రవి కుమార్

కడప మహి న్యూస్ । ఆగస్టు 21: కడపలోని 450 నివాస గృహాలతో కూడిన సింగపూర్ (ఎస్టీఎం) టౌన్‌షిప్ మ్యూచువల్లి ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ సొసైటీ చట్టం--1995 ప్రకారం ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. సొసైటీ నమోదు అనంతరం 300 మందికి పైగా కాలనీవాసులు సభ్యులుగా చేరారు. ఎన్నికల పరిశీలకులు రూపొందించిన షెడ్యూల్ ప్రకారం ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. ఆగస్టు 20న సాయంత్రం 5 గంటలకు నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన అనంతరం 15 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకులు ప్రకటించారు.

### కీలక బాధ్యతల్లో నూతన కార్యవర్గం

సొసైటీ అధ్యక్షుడిగా మాజీ మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డా. టి.ఎస్. రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రిమ్స్ నోడల్ అధికారి జి. రవి కుమార్, కోశాధికారిగా హోలిస్టిక్ హాస్పిటల్స్ జనరల్ సర్జన్ డా. ఎల్.




వెంకటేశ్వర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 12 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గానికి సంబంధించిన అధికారిక సమాచారాన్ని జిల్లా సహకార అధికారికి పంపినట్లు తెలిపారు.

### టౌన్‌షిప్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధ చర్యలు

ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు డా. టి.ఎస్. రెడ్డి మాట్లాడుతూ, అత్యధిక విద్యావంతులైన సభ్యులతో కూడిన నూతన కార్యవర్గం ఎస్టీఎం టౌన్‌షిప్ అభివృద్ధిని ప్రణాళికాబద్ధంగా, వ్యవస్థీకృతంగా ముందుకు తీసుకెళ్తుందని తెలిపారు. టౌన్‌షిప్‌లో మెరుగైన శుభ్రత, పారిశుధ్యం, స్థిరమైన నీటి సరఫరా, పటిష్టమైన భద్రతా చర్యలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. నివాసుల సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారం చూపే విధంగా నూతన కమిటీ పనిచేస్తుందని తెలిపారు.

### నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని విజ్ఞప్తి

తాత్కాలిక కమిటీ వెంటనే నివాసుల నుంచి నిర్వహణ రుసుము వసూలు చేయడం నిలిపివేసి, సంబంధిత రికార్డులు, బాధ్యతలను నూతనంగా ఎన్నికైన కమిటీకి అప్పగించాలని అధ్యక్షుడు కోరారు. నూతన కమిటీ పారదర్శకమైన, ప్రజాస్వామ్య పద్ధతిలో టౌన్‌షిప్ పరిపాలనను ముందుకు తీసుకెళ్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## సామాజిక మధ్యవర్తిత్వంతో వివాదాలకు సామరస్య పరిష్కారం

### పులివెందుల ఆర్.తుమ్మలపల్లిలో న్యాయ విజ్ఞాన సదస్సు

కడప జిల్లా/పులివెందుల మహి న్యూస్ ఆగస్టు 21: పులివెందుల మండలం ఆర్.తుమ్మలపల్లి గ్రామంలో "సామాజిక మధ్యవర్తిత్వం"పై న్యాయ విజ్ఞాన సదస్సు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి వారి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప చైర్మన్-కం-జిల్లా ప్రధాన న్యాయాధికారి



జి.రామ గోపాల్, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ సూచనల మేరకు మధ్యవర్తి న్యాయవాదులు, లీగల్ ఎయిడ్



డిఫెన్స్ కౌన్సిల్స్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన మధ్యవర్తి న్యాయవాదులు ఎ.సుబ్రహ్మణ్యం, వి.రాజగోపాల్ మాట్లాడుతూ.. గ్రామాల్లో, కుటుంబాల్లో, పొరుగువారి మధ్య ఏర్పడే చిన్నచిన్న వివాదాలను కోర్టుల వరకు తీసుకెళ్లకుండా పరస్పర చర్చలు, సయోధ్య ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునే విధానమే సామాజిక మధ్యవర్తిత్వమని వివరించారు. కుటుంబ సమస్యలు, పొరుగువారి మధ్య వివాదాలు, చిన్న ఆస్తి సమస్యలు, నీటి సమస్యలు, దారి సమస్యలు వంటి అనేక అంశాలను ఇరుపక్షాలు కలిసి చర్చించుకోవడం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. మధ్యవర్తిత్వంలో ఎవరు గెలిచారు, ఎవరు ఓడిపోయారు అనేది ముఖ్యంకాదని, ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం లభించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. మధ్యవర్తి ఇరుపక్షాల వాదనలు శాంతియుతంగా విని, వారి సమస్యలను అర్థం చేసుకుని, పరస్పర అంగీకారంతో పరిష్కారం కనుగొనేలా సహాయపడతారని చెప్పారు. మధ్యవర్తి తన నిర్ణయాన్ని ఏ పక్షంపైనా బలవంతంగా రుద్దరని స్పష్టం చేశారు. సామాజిక మధ్యవర్తిత్వం ద్వారా సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు కుటుంబాలు, పొరుగువారు, సమాజంలోని సంబంధాలు దెబ్బతినకుండా సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. సమస్యలను గొడవల ద్వారా కాకుండా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, కోర్టు మెట్లు ఎక్కే ముందు సయోధ్య మార్గాన్ని ఆలోచించాలని సూచించారు.

**"వివాదం కాదు – పరిష్కారం ముఖ్యం.**
**గొడవ కాదు – సయోధ్య ముఖ్యం.**
**కోర్టు కాదు – ముందుగా చర్చ ముఖ్యం."**

సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ సయోధ్య మార్గాన్ని అనుసరించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.మనోహర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, పులివెందుల మండల న్యాయ సేవా కమిటీ సిబ్బంది, కడప, పులివెందుల పారా లీగల్ వాలంటీర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లాలో నాలుగు రోజులు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు..!

### జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి



కడప, మహి న్యూస్ ఆగస్టు 21: ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ(ఎస్.ఐ.ఆర్.)లో భాగంగా ఈ నెల 22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక ప్రచార, నమోదు శిబిరాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు.. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఈ నాలుగు రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు అందుబాటులో ఉండనున్నారు. ముసాయిదా ఓటరు జాబితాలు, ఏఎస్‌డీడీ జాబితాలను పరిశీలించేందుకు, సందేహాలను నివృత్తి చేసేందుకు, అవసరమైన దరఖాస్తులను స్వీకరించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా 18--19 ఏళ్ల యువ ఓటర్లను పెద్ద సంఖ్యలో నమోదు చేయడంతో పాటు, ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన పౌరులను ఓటర్లుగా చేర్చేందుకు ఈ ప్రత్యేక శిబిరాలను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన 6, 7, 8, 8ఏ దరఖాస్తు పత్రాలను పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రత్యేక శిబిరాలపై జిల్లాస్థాయి నుంచి పోలింగ్ కేంద్రాల స్థాయి వరకు విస్తృత ప్రచారం నిర్వహించాలని, ఇందుకోసం ప్రింట్, ఎలక్ట్రానిక్ మాధ్యమాలతో పాటు స్థానికంగా ఇతర ప్రచార మార్గాలను కూడా వినియోగించి ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. శిబిరాల నిర్వహణను జిల్లా ఎన్నికల అధికారి స్వయంగా పర్యవేక్షించడంతో పాటు, ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రత్యేక శిబిరాల్లో బీఎల్ఓలు గైర్హాజరైతే తీవ్రంగా పరిగణించి సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సివుంటుందన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణలో భాగంగా జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ కాలం కొనసాగుతున్నందున అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు.

## అభివృద్ధి-సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### జమ్మలమడుగు నియోజకవర్గంలో యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం



కడప జిల్లా/ జమ్మలమడుగు మహి న్యూస్, ఆగస్టు 21: జమ్మలమడుగు మండలం మోరగుడి గ్రామంలో నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పెంచి అందించడం, అన్న క్యాంటీన్లు, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, దీపం పథకం, ఆటో డ్రైవర్ల సేవలో, చేనేతలకు ఉచిత విద్యుత్, నేతన్న సేవలో, మత్స్యకార సేవలో వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రాన్ని



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని భూపేష్ సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సౌర విద్యుత్, పవన విద్యుత్, దాల్మియా రెండో ప్లాంట్ విస్తరణ వంటి పలు ప్రాజెక్టులు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా స్థానికంగా పరిశ్రమలు ఏర్పడి, నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయడమే ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు నియోజకవర్గ పరిశీలకురాలు రామసుబ్బమ్మ, సీనియర్ నాయకుడు జంబాపురం రమణారెడ్డి, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి గురప్ప, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మల్లికార్జున, కొండయ్య, పాండులు, విశ్వనాథ్ రెడ్డి, చెన్నయ్య, ఇమ్మానియేల్, చంద్రశేఖర్ రెడ్డి, బాల్ రెడ్డి, లక్ష్మణ్, వెంకట రామిరెడ్డి, ధనుంజయ, గురు శంకర్, వెంకటరామిరెడ్డి, మోహన్ రెడ్డి, జయరాం రెడ్డి, బాబా మోదీన్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



రాయచోటి, మహిన్యూస్, ఆగస్టు 21 : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రాయచోటి పట్టణం కొత్తపేటలో నివాసం ఉండే షేక్ ఇలియాజ్ పుట్టిన రోజు సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అధ్యక్షులు లయన్ యస్. అంజిరెడ్డి తెలిపారు. అనంతరం దాత షేక్ ఇర్షాద్ మాట్లాడుతూ తన కుమారుడు షేక్ ఇలియాజ్ పుట్టిన రోజు సందర్భంగా ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ షేక్ మహమ్మద్, కోశాధికారి లయన్ కె.శ్రీనివాసులు(భూపతి), ఆశ్రమం మేనేజర్ సుబ్బయ్య ,దేవనాధ రెడ్డి పాల్గొన్నారు.

## ఆగస్టు 23 అర్ధరాత్రి నుంచి ఆటోలు, క్యాబ్‌లు, స్కూల్ వ్యాన్ల బంద్!



హైదరాబాద్, మహిన్యూస్, ఆగస్టు 21: ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక బంద్ చేపట్టనున్నట్లు బీఎంఎస్




అనుబంధ తెలంగాణ రాష్ట్ర ఆటో, ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ ప్రకటించింది. మండల రెవెన్యూ కార్యాలయాల ఎదుట మహాధర్నాలు నిర్వహిస్తూ ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లినట్లు యూనియన్ ప్రతినిధులు తెలిపారు. ఆటో డ్రైవర్లకు ఏటా ఇస్తామని ప్రకటించిన రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని బకాయిలతో సహా వెంటనే చెల్లించాలని, ఆటో మరియు ప్రైవేటు రవాణా కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త అనుమతులు మంజూరు చేయడంతో పాటు మూడు చక్రాల వాహనాల డ్రైవింగ్ లైసెన్సుల పునరుద్ధరణ చేపట్టాలని కోరారు. ఆర్టీసీలో ఈవీ ఆటోల ప్రవేశ ప్రతిపాదనను విరమించుకోవాలని, కేంద్రం రూపొందించిన గిగ్ కార్మికుల విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని, వాహనాల తుక్కు విధాన మార్గదర్శకాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. నగరాల్లో సరుకు రవాణా వాహనాల ప్రవేశ ఆంక్షల సమయాన్ని తగ్గించాలని, రవాణా నగరాలను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఓలా, ఊబర్, ర్యాపిడో పేరుతో జరుగుతున్న అక్రమ ద్విచక్ర వాహన రవాణాను అరికట్టాలని, ఆటో, క్యాబ్ మీటర్ చార్జీలను పెంచాలని, అక్రమ అంబులెన్స్ సేవలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. లారీ, బస్సు డ్రైవర్ల కోసం జాతీయ రహదారులపై విశ్రాంతి గృహాలు, రాయితీ క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని, స్కూల్ వ్యాన్లకు పాఠశాలల వద్ద పార్కింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. పోలీసుల ఈ-చలాన్లపై 80 శాతం రాయితీ ఇవ్వాలని, రవాణా కార్మికుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలిచి పరిష్కారం చూపాలని యూనియన్ నాయకులు కోరారు. డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించకపోతే 23వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆటోలు, స్కూల్ వ్యాన్లు, క్యాబ్‌లు నిరవధిక బంద్‌లో పాల్గొంటాయని స్పష్టం చేశారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPA DIST, A.P
PRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108.APTEL/26/A5325.APTEL/26/A3560 Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com